
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

5

మంగళవారం 5 ఆగస్టు 2025

గరిష్ఠం 34.0
కనిష్ఠం 25.0
****

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.50 (302.9125)	66,407	44,432
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.90 (3.91)	1,248.48	668.44
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.2919 (43.1584)	24,450	17,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.170 | స్కిన్‌లెస్ : రూ.190



రెయిన్ గేజ్ పరికరాలు

చినుకుల లెక్క తప్పుతోంది!

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షపాతం కొలతలపై గందరగోళం నెలకొంది. గ్రామం యూనిట్‌గా కాకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకొని రెయిన్ గేజ్‌ల ద్వారా వర్షపాతాన్ని నమోదు లెక్కిస్తున్నారు. అయితే మండలంలో, లేదంటే ఆ మండలంలోని శివారులో ఏదో ఒక ప్రాంతంలో రెయిన్ గేజ్ ఏర్పాటు చేశారు. ఇవి కేవలం ఆ ప్రాంతంలో కురిసిన వర్షపాతాన్ని మాత్రమే లెక్కిస్తున్నాయి. దీన్నే మండల వర్షపాతంగా పరిగణనలోకి తీసుకుంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- మండలం యూనిట్‌గానే వర్షపాతం నమోదు
- గ్రామాల వారీగా వర్షపాతం లెక్కింపుపై దృష్టిసారించని ప్రభుత్వం
- పరికరం ఉన్నప్రాంత వర్షపాతమే మండలం మొత్తం ఉన్నట్లు లెక్కలు

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రేయిన్ గేజ్ ఉంటే ఆ ప్రాంతంలో కురిసిన వర్షాన్ని మండల సగటు వర్షపాతంగా లెక్కిస్తున్నారు. మండలంలోని ఇతర గ్రామాల్లో వర్షం లేకున్నా, ఆ మండలం మొత్తం వర్షం కురిసినట్లుగా అధికారులు లెక్కలు వేస్తారు. రేయిన్ గేజ్‌ను మాన్యువల్‌తో పాటు ఆటోమెటిక్‌గా లెక్కించే వాటిని ఏర్పాటు చేశారు. రెయిన్ గేజ్‌పై వాతావరణ శాస్త్రవేత్తలతో పాటు హైడ్రాలజిస్టులకు అవగాహన ఉంటుంది. మండలాల వారీగా ఏర్పాటు చేసిన రెయిన్ గేజ్‌లలో ఆ ప్రాంతంలో కురిసిన వర్షపాతాన్ని మండల కార్యాలయంలో పనిచేసే ఉద్యోగి సేకరించి నివేదిక పంపిస్తారు. వర్షపు నీరును అంగుళాలు లేదంటే మీటర్లలో కొలుస్తారు. వాస్తవానికి మాన్యువల్ రెయిన్ గేజ్ కంటే ఆటోమెటిక్ రెయిన్ గేజ్ కచ్చితమైన కొలతలు ఇస్తాయని పేర్కొంటున్నప్పటికీ కొలతల్లో తేడాలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 72 మండలాల్లో ఈ రెయిన్ గేజ్‌లు ఏర్పాటు చేశారు. రెయిన్ గేజ్‌లలో సేకరించిన నీటిని సిలిండర్ ద్వారా కొలుస్తారు. ఈ సిలిండర్లలో 25మి.మీల వరకు వర్షపాతం కొలిచే అవకాశం ఉంటుంది.

మిల్లీమీటర్లు లేదా సెంటీమీటర్లలో..

వర్షపాతాన్ని మిల్లీమీటర్లు లేదా సెంటీమీటర్లలో కొలుస్తారు. 10మి.మీలు వర్షపాతం కురిస్తే 1సెం.మీగా నమోదు చేస్తారు. వర్షపాతం నమోదును బట్టి ఎల్లో, ఆరెంజ్, రెడ్ అలర్ట్‌ను వాతావరణ శాఖ ప్రకటిస్తుంది. మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిస్తే ఎల్లో అలర్ట్‌ను, తేలికపాటి జల్లుల నుంచి వర్షాలు కురిస్తే గ్రీన్ అలర్ట్‌ను జారీ చేస్తుంది. ప్రస్తుతం ఉన్న రేయిన్ గేజ్‌లతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాన్ని కచ్చితంగా అంచనా వేయడం కష్టంగా ఉంది. కురుస్తున్న వర్షాలు నమోదవుతున్న లెక్కల్లో భారీ తేడాలు ఉండటంతో వర్షపాతం లెక్కలపై అయోమయం నెలకొంటోంది. ఆగస్టు మాసంలో మోస్తరు వర్షాలు తప్ప భారీ వర్షాలు నమోదు కాలేదు. దీంతో చెరువుల, కుంటలు నిండని పరిస్థితి ఉంది. సోమవారం జిల్లా వ్యాప్తంగా 21.8 సెం.మీల సగటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు లెక్కలు చూపారు. ఈ నెలలో తొమ్మిది మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు అధికారులు చూపారు. అయితే ఆ మండలాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే వర్షాలు అంతగా లేని పరిస్థితి ఉంది. 15 మండలాల్లో ఆగస్టులో సాధారణ వర్షపాతం నమోదైందని సీపీవో కార్యాలయం నుంచి నివేదిక ఇచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులను అంచనా వేయకుండానే సంవత్సరాల తరబడి మండల కేంద్రాల్లో..

- మిగతా 8వ పేజీలో...

● పవిత్రోత్సవాలు ప్రారంభం



7

గుట్ట ఆలయంలో పవిత్రోత్సవాల ప్రారంభం సందర్భంగా స్వస్తి వాచనం నిర్వహిస్తున్న అర్చకులు

నిర్లక్ష్యంతో నిరుపయోగం



- ఎకరాల కొద్దీ ఎన్నెస్పీ భూములు
- ఖాళీగా కోట్ల విలువైన క్వార్టర్స్
- శిథిలావస్థకు చేరిన ఇళ్లు
- ఇళ్లలోకి వస్తున్న క్రిమి కీటకాలు
- బెంబేలెత్తుతున్న కాలనీ వాసులు

6

పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి:కలెక్టర్



మిర్యాలగూడలో ఓపీ రికార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

నల్లగొండ(కలెక్టరేట్), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలను పకడ్బందీగా అమలుచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆమెప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మండలాల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు ప్రభుత్వ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లను సవాల్‌గా తీసుకొని సందర్శించాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు వారి మండలంలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు మోడల్ పాఠశాలలను సందర్శించి సమస్యలు లేకుండా చూడాలన్నారు. విద్య, వైద్యం, పరిపాలన అంశాల్లో మండలాల ప్రత్యేక అధికారులది కీలకపాత్ర అని అన్నారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణఅమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, డీఆర్‌డీవో నాగిరెడ్డి, ఆర్డీవోలు వై.అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతిని పెంచాలి

గుర్రంపోడు ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతి తీసుకువచ్చేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. గుర్రంపోడు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఎక్కడైనా ఇసుక, లేబర్ సమస్య ఉంటే తహసీల్దార్‌తో మాట్లాడి పరిష్కరించాలని ఎంపీడీవోకు సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆస్పత్రి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి ఆవరణలో నిర్మిస్తున్న నూతన భవనాన్ని రెండు నెలల్లో పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిని ఎమ్మెల్యే బీఎల్‌ఆర్‌తో కలిసి ఆమె పరిశీలించి వైద్యసేవలను సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో 125 పడకలు అందుబాటులో ఉన్నాయని, నూతన భవన నిర్మాణ పనులు పూర్తయితే ఆస్పత్రి సామర్థ్యం 200 పడకలకు విస్తరిస్తుందన్నారు. నూతన భవన నిర్మాణం కోసం ఇప్పటికే రూ.4.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పెరిగిన ఆస్పత్రి సామర్థ్యానికి అనుగుణంగా రూ.35లక్షల వ్యయంతో నూతనంగా 160 కేవీ జనరేటర్ మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అదేవిధంగా శానిటేషన్ చర్యలు మెరుగుపరిచేందుకు మరో ఏడుగురు అదనపు సిబ్బందిని నియమించుకునేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఆమె వెంట సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీసీహెచ్‌వో డాక్టర్ మాతృనాయక్, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ సమరద్, తదితరులు ఉన్నారు.

బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి

ఎస్పీ శరత్‌చంద్రపవార్



గ్రీవెన్స్‌డేలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించి 48 మంది అర్జీదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఫోన్‌లో అధికారులతో మాట్లాడారు. ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో పోలీసులను నేరుగా కలవాలని, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని సూచించారు.

నల్లగొండను విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతాం

- రెసిడెన్షియల్ స్కూల్ రాష్ట్రంలోనే మొదటిది కావాలి
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాను విద్యా హబ్‌గా తీర్చిదిద్దుతామని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని గంధవారిగూడెంలో రూ.200కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులకు మంత్రి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి చేపట్టిన బృహత్తర పాఠశాల యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల అని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం రూ.20వేల కోట్లతో ఇలాంటి పాఠశాలలను డిజైన్ చేసి నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోనే నల్లగొండ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల మొదటిదని, ఇది రికార్డు సృష్టించాలని అన్నారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌తో పోటీపడి ఈ పాఠశాల నిర్మాణాన్ని వేగంగా చేపట్టి బాగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలని అన్నారు. విద్య, ఉపాధిలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రస్తుతం నల్లగొండలో బాలికలకు ఉద్దేశించి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరు కాగా, బాలురకు కూడా ఇలాంటి పాఠశాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో కూడా త్వరలోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులకు భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ నల్లగొండ యంగ్ ఇండియా ఇంటిగ్రేటె డ్ రెసిడెన్షియల్ పాఠశాలను 25 ఎకరాల్లో నిర్మించనున్నట్లు తెలిపారు. నాగార్జునసాగర్ నియోజకవర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలకు మంచి స్థలాన్ని గుర్తించామని, త్వరలోనే అక్కడ శంకుస్థాపన పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. టీజీఈడబ్ల్యూ ఎంఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలప్రసాద్ నల్లగొండలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల వివరాలను తెలియజేశారు.

అందరికీ అందుబాటులో క్యాంపు కార్యాలయం

అందరికీ అందుబాటులో ఉండే విధంగా గడియారం సెంటర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని నిర్మించామని, ఈ కార్యాలయం ఒక ఎమ్మెల్యేకే కాకుండా ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలకు నల్లగొండకు వచ్చినప్పుడు వసతి ఉండేలా నిర్మించామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో సోమవారం రూ.13కోట్ల వ్యయంతో నిర్మించిన క్యాంపు కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ కార్యాలయానికి ఇందిరా భవన్‌గా నామకరణం చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా నడుస్తున్నాయన్నారు. నకిరేకల్ నియోజకవర్గానికి తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రూ.20 కోట్లు మంజూరు చేస్తూ ఫైల్‌పై సంతకం పెట్టినట్లు తెలిపారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పథకాల గురించి వివరించారు.

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. గుర్రంపోడు బ్రిడ్జిని నిధులు మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్, ఎమ్మెల్యే వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, నారాయణఅమిత్, నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి, విద్యాశాఖ అధికారి భిక్షపతి, టీజీఈడబ్ల్యూ ఐడీసీడీఈ శైలజ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ హఫీజ్‌ఖాన్, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు కోసం ఉద్యమాలు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరభద్రం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

నల్లగొండ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వాగ్దానాల అమలు కోసం ఉద్యమాలు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నల్లగొండ పట్టణంలోని అలకాపురి కాలనీలోని కోటిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 11సంవత్సరాలుగా ప్రజా సమస్యలను పరిష్కరించకుండా భావోద్వేగాలను రెచ్చగొడుతూ విధ్వంసకర పాలన చేస్తోందని ఆరోపించారు. బీజేపీ పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్య పరచాలన్నారు. సామ్రాజ్యవాదం, కార్పొరేట్లకు మోదీ లొంగిపోయాడని ధ్వజమెత్తారు. పహల్గాం దాడి జరుగుతున్న విషయం ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా ప్రధానికి ముందే తెలుసని, ఇందులో భాగంగా ప్రధాని పర్యటన రద్దు చేసుకుని, పర్యాటకులకు ఎందుకు అనుమతించారని ప్రశ్నించారు. దేశ పరువు దిగజారే విధంగా ట్రంపు వ్యవహరిస్తున్నా ఆ వ్యాఖ్యలను తిప్పికొట్టేందుకు ప్రధాని మోదీ నోరు ఎందుకు మెదపడం లేదో చెప్పాలన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేయకుండా కాళేశ్వరం బనకచర్ల పేరిట ప్రజల దృష్టి మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలప్పుడు రాష్ట్రం ఎంత అప్పులో ఉందో రేవంత్‌రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. అలాంటప్పుడు ఆచరణలో అమలు కాని హామీలు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. ఇప్పుడు ఆ హామీలు అమలు చేసేందుకు నిధుల కొరత పేరిట తప్పించుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేసేంతవరకు గ్రామస్థాయిలో ప్రజలను చైతన్య పరిచి ఉద్యమాలు చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక సమస్యలపై భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలు చేయబోతున్నట్లు తెలిపారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలలో గ్రామస్థాయిలో ప్రజా సమస్యలను అధ్యయనం చేసి, వాటి పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో ఉద్యమాలు చేయాలని కోరారు. ఈనెల 6వ తేదీ నుంచి 15 వరకు సమస్యలపై సర్వేలు, అధ్యయన బృందాలతో పర్యటన చేయాలన్నారు. ఈ నెల 10నుంచి 20 వరకు సంతకాల సేకరణ, 20 నుంచి 30 వరకు సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు, గ్రామపంచాయతీల వద్ద ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1న తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాలు, ముట్టడి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ కొనసాగుతోందని, పెండింగ్‌లో ఉన్న రైతుబంధు, రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలని కోరారు. రైతులకు యూరియా కొరత రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు అందుబాటులో యూరియా ఉంచాలన్నారు. గ్రామాల్లో కొందరికి మాత్రమే ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇచ్చే విధంగా లిస్టులు తయారు చేయడం సరైనది కాదని అన్నారు. అందరికీ పక్కా గృహాలు ఇవ్వాలని కోరారు. సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, కందాల ప్రమీల, బండ శ్రీశైలం, చినపాక లక్ష్మీనారాయణ, సయ్యద్ హాషం, వీరేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏఎమ్మార్పీ డీ-39, డీ-40 కాల్వలకు నీరందించాలి



నీటిపారుదల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నల్లగొండ కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఏఎమ్మార్పీ డీ-39, డీ-40 కాల్వలకు నీరందించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తిప్పర్తి, మాడుగులపల్లి మండలాల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన రైతుల పక్షాన బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నీటిపారుదల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల పోరాటం చేసి సాధించుకున్న ఈ ప్రాంత ప్రజలకు ఏఎమ్మార్పీ కాల్వ ద్వారా నీళ్లు అందించకుండా ప్రభుత్వం ఈ ప్రాంత రైతులను ఇబ్బంది గురిచేస్తోందన్నారు. ఓవైపు బ్రాహ్మణ వెల్లెంల, అయిటిపాముల కాల్వలకు పూర్తిస్థాయిలో నీరందిస్తూ తిప్పర్తి, మాడుగులపల్లి ప్రాంత మండలాల రైతులపై వివక్ష చూపుతోందని అన్నారు. వారబందీ అమలు చేస్తున్నామంటూ అధికారులు పూర్తిస్థాయిలో తిప్పర్తి, మాడుగులపల్లి మండలాలకు వచ్చే కాల్వలకు నీరు వదలటం లేదన్నారు. ఐటి పాముల బ్లాక్‌కు వెళ్లే షెటర్లను, కొంతమంది దుండగులు ధ్వంసం చేసినా అధికారులు వాటిని రిపేర్ చేయించకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు.

ధ్వంసమైన షెటర్ల ద్వారా కిందికి వెళ్లిపోయి పూర్తిస్థాయిలో తిప్పర్తి, మాడుగులపల్లి మండలాలకు సాగు నీరు అందక, చెరువు కుంటల్లో నీరు లేక భూగర్భ జలాలు పడిపోయాని ఆందోళన వ్యక్తం చేశారు. తిప్పర్తి మండలం తనకు గుండెకాయ లాంటిదని తెలిపే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఈ ప్రాంత రైతుల గోస కనపడటేదా? వినిపించడం లేదా? అని ప్రశ్నించారు. మంత్రి నిర్లక్ష్యంతో వందల టీఎంసీలు సాగర్ నుంచి సముద్రం పాలవుతున్నా అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి పూర్తిస్థాయిలో పానగల్ ఉదయ సముద్రానికి నీరు అందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, డి-39, డి-40 కాల్వల ద్వారా చివరి భూముల వరకు పూర్తిస్థాయిలో నీరందించి చెరువులు, కుంటలను నింపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కందుల లక్ష్మయ్య, ముకిరాల కృష్ణ, గుండెబోయిన రామచంద్రు, గుండెబోయిన నాగరాజు, దేవిరెడ్డి లింగారెడ్డి, బొల్లెద్దు వెంకన్న, అంతటి చెన్నకేశవులు, చింతకుంట దయాకర్ రెడ్డి, కే.సురేందర్‌రెడ్డి, చెదురుపల్లి జనార్ధన్, చిన్నగోని వెంకన్న రొట్టెల జానయ్య, జక్కలి రవి, కట్ట బిట్టు పాల్గొన్నారు.

నేడు కాళేశ్వరం ప్రాజెక్టుపై వీడియో ప్రదర్శన

నల్లగొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రత్యక్ష వీడియో ప్రదర్శన ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రత్యక్ష వీడియో ప్రదర్శన ఇవ్వనున్నారని తెలిపారు. ఈ వీడియో ప్రదర్శనను తిలకించేందుకు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

నిర్లక్ష్యంతో నిరుపయోగం

● ఎకరాల కొద్దీ ఎన్నెస్పీ భూములు ● ఖాళీగా కోట్ల విలువైన క్వార్టర్స్ ● శిథిలావస్థకు చేరిన ఇళ్లు



మిర్యాలగూడలోని ఎన్నెస్పీ క్యాంప్ కాలనీ

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ నడిబొడ్డున ఉన్న సుమారు 85 ఎకరాల ప్రభుత్వ స్థలంలో 388 ఎన్నెస్పీ కార్వర్లున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, ఉద్యోగుల ఉదాసీనత, పాలకుల పట్టింపులేని తనంతో ఎన్నెస్పీ క్యాంప్ స్థలం, క్వార్టర్స్ పరిస్థితి 'చూసుకుని మురవ, చెప్పుకుని ఏడువ' అన్నట్లుగా ఉంది.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

ఏడున్నర దశాబ్దాల కిందట కృష్ణానదిపై నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మించారు. ప్రాజెక్టు నిర్మాణ, నీటిపారుదల పనుల నిర్వహణ కోసం మిర్యాలగూడ పట్టణ శివారులోని సుమారు 85 ఎకరాల స్థలాన్ని ఎన్నెస్పీకి కేటాయించారు. సాగర్ ఎడమకాల్వ పరిధిలోని సర్కిల్ ఆఫీస్, వర్క్‌షాప్, పేఅండ్‌ఎకౌంట్స్ విభాగంతో పాటు అధికారులు, ఉద్యోగుల నివాసాల కోసం పలు విభాగాలుగా ఎన్నెస్పీ క్వార్టర్స్ నిర్మించగా నాడు కళకళలాడిన క్యాంప్ నేడు బోసిపోయినట్లుగా మారింది.

విభాగాలుగా 388 క్వార్టర్లు

పలు కార్యాలయాలతో పాటు ఇళ్లను కూడా పలు విభాగాలుగా విభజించి నిర్మించారు అధికారులు. ఏ టైపు క్వార్టర్స్ 36, బీ టైపు క్వార్టర్స్ 105, సీ టైపు 205 క్వార్టర్స్‌తో పాటు ఈఏఈ టైపు 10, క్వాలిటీ కంట్రోల్ భవనాల పేరుతో ఎనిమిది, గెస్ట్‌హౌస్‌లతో కలిపి మొత్తం సుమారుగా 388 నిర్మాణాలు జరిగాయి.

కార్యాలయాల తరలింపుతో..

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, జిల్లాల పునర్విభజన కారణంగా అన్నిశాఖలతో పాటు ఎన్నెస్పీ కార్యాలయాల తరలింపుతో క్యాంప్ కళతప్పింది. ఎన్నెస్పీ క్యాంప్‌లో నిర్మించిన సర్కిల్ ఆఫీస్, వర్క్‌షాప్, పే అండ్ ఎకౌంట్స్ విభాగాలు మరో ప్రాంతానికి మార్చగా, సూపరింటెండెంట్ ఆఫీసు సూర్యాపేట జిల్లా కోదాడకు తరలింది. దీంతో ఆయా భవనాలు, గృహాలు ఖాళీ అవ్వగా అందులో కొన్ని క్వార్టర్స్ ఆక్రమణలకు గురయ్యాయి.

ఖాళీకి కారణాలెన్నో

ఎన్నెస్పీ విభాగంలో ఉద్యోగం చేస్తున్నప్పటికీ హెచ్‌ఆర్‌ఏ (ప్రభుత్వం నిర్ధేశించిన అద్దె) ఎక్కువగా ఉండటంతో ఉద్యోగులు. ఇక్కడ క్వార్టర్స్ ఖాళీ చేసి ఇతర ప్రాంతాలలో ఉంటున్నారు. 10 నుంచి 13 శాతం వరకు వేతనంలో హెచ్‌ఆర్‌ఏ మినహాయిస్తున్నారని, అది బయట అద్దెలతో పోలిస్తే ఎక్కువగా ఉందని ఉద్యోగులు వాపోతున్నారు. అరకొర వసతులు, నిర్వహణ లేని క్వార్టర్లకు అంత అద్దె చెల్లించలేక క్యాంప్‌ను వీడినట్లు చెబుతున్నారు.

శిథిలావస్థకు చేరడంతో..

నిర్వహణ లోపం కారణంగా ఎన్నెస్పీ క్యాంప్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. నిర్మాణానికి ఉపయోగించిన సిమెంట్ రేకుల కాలం చెల్లడంతో వర్షాలకు కురవడం, మట్టి గోడలు కూలడంతో నివాసానికి యోగ్యంగా లేవు. ఆయా ఇళ్ల పిచ్చిచెట్లు, పుట్టలతో నిండిపోవడంతో కీటకాలు తిరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

నిర్వహణ లోపంతో..

శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివసించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు.దశాబ్దాల కాలంగా ఇక్కడే నివసిస్తున్నామని, మెయింటనెన్స్ లేక క్వార్టర్లన్నీ శిథిలావస్థకు చేరాయని విశ్రాంత ఉద్యోగుల కుటంబీకులంటున్నారు. ప్రతీసీజన్‌లో కాస్తో, కూస్తో రిపేర్లు చేసుకుంటున్నామంటున్నారు. దశాబ్దాల తరబడి ఇక్కడే ఉంటున్న తమకే క్వార్టర్స్ కేటాయించాలని కొందరు కోరుతున్నారు. పుష్కరకాలంగా నిర్వహణ నిధులు మంజూరు కాలేదని, ప్రధానకార్యాలయాలన్నీ తరలివెళ్లడంతో క్వార్లర్లు ఖాళీ అయ్యాయని ఎన్నెస్పీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.



ప్రభుత్వ కార్యాలయాలు వచ్చినా

బీఎస్ఎన్ఎల్ భవనం, ఆర్డీవో ఆవాసం, ఏరియా ఆస్పత్రి, పోస్టాఫీసు శాఖ దశాబ్దాల క్రితమే క్యాంప్ ప్రాంతంలో ఉండగా తదనంతరం మునిసిపల్, పంచాయతీరాజ్ కార్యాలయాలను ఎన్నెస్పీ క్యాంప్‌లోనే నిర్మించారు. ఎక్సైజ్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ భవనం, మిని రవీంద్రభారతి, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఫారెస్ట్ ఆఫీసు, బీసీ, ఎస్టీ భవనాలను సైతం ఇక్కడే నిర్మించారు. అయితే ఆయా కార్యాలయాలున్న ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండగా, సీ టైపు క్వార్టర్లు, ఉత్తర, పడమర వైపున ప్రాంతం పారిశుధ్య నిర్వహణ లేదని స్థానికులు వాపోతున్నారు.

కీటకాలు వస్తున్నాయి



పుట్టి, పెరిగింది ఎన్నెస్పీ క్యాంప్‌లోనే. దశాబ్దాల కిందట నిర్మించిన క్వార్టర్స్‌కు కాలం చెల్లడం, ఖాళీ కావడంతో ఇళ్లన్నీ శిథిలావస్థకు చేరాయి. గతంలో ఆహ్లాదరకమైన వాతావరణం, పరిశుభ్రత ఉండేది. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదు. ఇళ్లకు, ఇళ్లకు మధ్య పిచ్చి చెట్లు మొలిచాయి, పొదలు, పుట్టలు ఏర్పడంతో పురుగులు, పాములు సంచరిస్తున్నాయి.

ఎండీ. కౌసర్, స్థానికురాలు

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలి



రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన అవసరముంది. ఎన్నెస్పీ క్యాంప్ స్థలాలపై అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వీడాలి. స్థలాల ఆక్రమణ, క్వార్టర్స్ దుర్వినియోగం అవుతున్నాయి. అద్దె, విద్యుత్ బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై గతంలో లోకాయుక్తకు ఫిర్యాదుచేయగా ఎన్నెస్పీతో పాటు రెవెన్యూ, పోలీస్ శాఖలకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు చేసింది. అప్పటి నుంచి అధికారులు ఇంటి అద్దె, విద్యుత్ చార్జీలు, నీటి పన్ను వసూలుకు చర్యలు చేపట్టి చేతులు దులుపుకున్నారు.

- బానావత్ రతన్‌సింగ్‌నాయక్, మిర్యాలగూడ.

ప్రేమ విఫలమైందని యువకుడి బలవన్మరణం



కార్తీక్(ఫైల్‌ఫొటో)

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో సోమవారం ప్రేమవిఫలమైందన్న మనస్థాపంతో యువకుడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సీఐ మోతీరాం తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఇందిరమ్మకాలనీకి చెందిన కేశబోయిన కార్తీక్(26) మిర్యాలగూడ మండలంలోని ఓ బాలికను ప్రేమించాడు. ప్రేమజంట ఇష్టపడి ఎనిమిది నెలల కిందట ప్రేమవివాహం చేసుకున్నారు. అయితే సదరు ప్రేమికురాలు మైనర్‌కావడంతో ఆమె తల్లిదండ్రులు రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేయగా, ఫోక్సో చట్టం కింద కార్తీక్‌పై కేసునమోదు చేసి జైలుకు పంపారు. వారం రోజుల క్రితం జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన కార్తీక్ మేజర్ అయి తన ప్రియురాలికి వేరే వ్యక్తితో నిశ్చితార్థం జరిగిందన్న సమాచారం తెలుసుకున్నాడు. దీంతో తన ప్రేమ విఫలమైందని తీవ్రమనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. బయటకు వెళ్లిన తల్లిదండ్రులు తిరిగి ఇంటికి చేరుకొని గదిలోకి వెళ్లగా ఉరితాడుకు వేలాడుతున్న కుమారుడిని చూసి బోరుమని విలపించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వన్‌టౌన్ సీఐ మోతీరాం సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కార్తీక్ తండ్రి సైదులు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేఐస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచిపడి గీతకార్మికుడి మృతి



సుధాకర్(ఫైల్)

వలిగొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి జారి పడి ఓ గీత కార్మికుడు సోమవారం మృతి చెందాడు. ఎస్ఐ యుగేందర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండంలోని పహిల్వాన్‌పురం గ్రామానికి చెందిన వట్టిపల్లి సుధాకర్ (55) వృత్తిలో భాగంగా సోమవారం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి కిందపడ్డాడు. సమీపంలోని రైతులు వచ్చి చూసేసరికి ప్రాణాలు కోల్పోయాడు. వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సుధాకర్ కుమారుడు లింగస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నటు ఎస్ఐ తెలిపారు. కాగా, సుధాకర్‌కు భార్య, వివాహితులైన ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు.

విషపు ఆకు తిని 150 గొర్రెలు మృత్యువాత

● రూ. 15లక్షలు నష్టం ● కన్నీరుమున్నీరైన కాపరులు



గొర్రెల కళేబరాలు

మునగాల / మునగాల రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పొట్టకూటి కోసం పొరుగు రాష్ట్రానికి వచ్చిన గొర్రెలకాపరులకు తీరని నష్టం జరిగింది. సుంకు అనే ఆకుతిన్న 150 గొర్రెలు మృతి చెందడంతో కాపరులు కన్నీటి పర్యంతమయ్యారు. రాష్ట్రంలోని నారాయణ ఖేడ్ జిల్లా దువ్వాడ మండలం హనుమాన్ గ్రామానికి చెందిన శివకుమార్, లింగప్ప, గోవిందు, కుర్మప్ప, వెంకటేష్, శ్రీను, అశోక్, రాజు, మోనప్ప, కలసి ఊరూర తిరుగుతూ గొర్రెలను మేపుతున్నారు. కాగా నాలుగు రోజుల క్రితం మునగాల మండలం మొద్దుల చెరువు స్టేజి సమీపంలో దాదాపు 900 వందల గొర్రెలను మేపుతున్నారు. ఈ క్రమంలో సుంకు అనే విషపు ఆకు తిన్న గొర్రెలకు మూతి, కళ్లు వాపుగా ఉన్నాయని వారు గమనించారు. వెంటనే గొర్రెల కాపరులు వాటికి చికిత్స చేకుంటూ, వాటికి ఎండ పడని వెంచర్లలో ఉన్న గదిలో ఉంచారు. అయనప్పటికీ మృతి చెందాయి. తండ్రీకుమారులైన శివకుమార్, లింగప్ప కలిపి దాదాపు 100కు పైగా మృతి చెందాయి. మిగిలిన 50 గొర్రెలు ప్రతి ఒక్కరివి 10 నుంచి 5 వరకు మృతి చెందాయి. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీస్, పశువైద్యాధికారి అక్కడికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్ట చేస్తే పూర్తి ఆధారాలు తెలుస్తాయని వైద్యాధికారి మమత తెలిపారు. సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని కాపరులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు

నేరేడుచర్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం జగనాతండాలో విద్యుదాఘాతంతో చూడి ఆవు మృతి చెందింది. సోమవారం రమావత్ నరేష్‌కు చెందిన పశువుల కొట్టంలో రాత్రి వచ్చిన గాలి, వానకు విద్యుత్ సర్వీస్ వైరు తెగి కొట్టం రేకుల మీద పడడంతో సోమవారం తెల్లవారుజామున కొట్టంలో ఉన్న ఆవుకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ. 70 వేలు ఉంటుందని యజమాని నరేష్ తెలిపారు. విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చానని, తనను ఆదుకోవాలని కోరారు.

బైక్ నెంబర్ ప్లేట్లు మారుస్తూ గంజాయి రవాణా



నార్కట్‌పల్లిలో కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ డీఎస్పీ శివరాంరెడ్డి

నార్కట్‌పల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బైక్ నెంబర్ ప్లేట్లు మారుస్తూ సినీ ఫక్కీలో గంజాయి రవాణా చేస్తున్న నిందితులను నల్లగొండ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు నిందితులు, ఓ మైనర్ బాలుడితో సహా మొత్తం నలుగురిని అరెస్టు చేశారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. ఒడిషా రాష్ట్రం మల్కన్‌గిరికి చెందిన బాదల్ దాకువ సులువుగా డబ్బులు సంపాదించాలని గంజాయి రవాణా చేస్తూ, విక్రయిస్తున్నాడు. అదే ప్రాంతానికే చెందిన జీబన్ డెపారీ, కిరణ్ బైద్యా, సుధాషేన్ సాలే, మరో మైనర్‌ను ఎంపిక చేసుకున్నాడు. బైక్‌లపై హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తే ఒకొక్కరికి రూ.3వేలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ నలుగురు బైక్‌లపై సుమారు రూ.1.50లక్షల విలువైన ఏడు కిలోల గంజాయిని ప్యాక్ చేసుకుని బైక్ నెంబర్ ప్లేట్లను మారుస్తూ ఒడిషా నుంచి హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్ సోమవారం జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో రెండు ద్విచక్రవాహనాలపై అనుమానాస్పదంగా వెళ్తున్న యువకులను ఆపి తనిఖీ చేశారు. బైక్ నెంబర్ ప్లేట్లు అసలివి కావని నెంబర్ ప్లేట్లు మార్చినట్లు గుర్తించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. తాము గంజాయి సరఫరా చేసేందుకు వెళ్తున్నామని అంగీకరించడంతో రవాణా చేస్తున్న నలుగురిపై కేసు నమోదు చేశారు. నిందితుల నుంచి సుమారు ఏడు కిలోల గంజాయి, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి రవాణా చేస్తున్న నిందితులను పట్టుకోవడంలో సీఐ కే.నాగరాజుతో పాటు చాకచక్యంగా వ్యవహరించిన నార్కట్‌పల్లి ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్, హెచ్‌సీలు రాము, జవహర్, రమేశ్, సత్యనారాయణ, పీసీలు సత్యనారాయణ, తిరుమల్, శ్రీకృష్ణ, శివలను జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.

మినీట్రావెల్స్ బస్ బోల్తా: ఒకరి మృతి



మంగీలాల్ మృతదేహం



రోడ్డు పక్కన గుంతల్లో పల్టీకొట్టిన మినీ ట్రావెల్స్ బస్సు

శాలిగౌరారం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అదుపు తప్పిన వేగంతో ఆటోను ఢీకొట్టిన మినీ ట్రావెల్స్ బస్సు బోల్తా పడి ఒకరు మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా వాసులు శ్రీశైలం దర్శనానికి వెళ్లి వస్తుండగా నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం మాదారంలో ప్రమాదం జరిగింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా పత్తిపాక గ్రామపరిధిలోని వినాయకతండాకు చెందిన 14 మంది మేస్త్రీలు ఈ నెల 3న శ్రీశైలం దేవస్థానానికి మినీ ట్రావెల్ బస్సును తీసుకొనివెళ్లారు. శ్రీశైలం నుంచి తిరుగు ప్రయాణంలో 4న తెల్లవారుజామున 3 గంటల సమయంలో నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం మాదారం వద్ద జాతీయ రహదారిపైన బస్‌డ్రైవర్ గుండెబోయిన నవీన్ అతి వేగంగా నడుపుతూ రోడ్డుపక్కన నిలిపి ఉన్న ఆటోను ఢీకొట్టడంతో ట్రావెల్స్ బస్సు పల్టీ కొట్టింది. ఈ ఘటనలో బస్సులోని బానోత్ మంగీలాల్(47) తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. బానోత్ రమేష్, బానోత్ లాల్, భూక్యా, వీరన్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వీరందరినీ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో ఏడుగురుకి స్వల్ప గాయాలయ్యాయి. మంగీలాల్ భార్య బానోత్ పద్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి

తుర్కపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని రుస్తాపూర్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ తక్యుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ పట్టణ కేంద్రానికి చెందిన దేవరకొండ రాఖేశ్(28), జనగామ పట్టన కేంద్రానికి చెందిన హరీష్ భువనగిరి పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నారు. ఉదయం బ్యాంక్ కస్టమర్లను కలిసి మాట్లాడేందుకు ద్విచక్రవాహనంపై తుర్కపల్లికి వచ్చారు. అనంతరం తిరుగు ప్రయాణంలో రుస్తాపూర్ గ్రామ సమీపంలో గేదె అడ్డంగా రావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోయారు. ఈ ఘటనలో వెనకాల కూర్చున్న దేవరకొండ రాఖేశ్‌కు తీవ్రగాయాలుకావడంతో చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బండి నడుపుతున్న హరీష్‌కి హెల్మెట్ ఉండడంతో స్వల్పగాయాలతో బయట పడ్డాడు. రాఖేశ్ భార్య శ్రీజ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లపై కేసులు నమోదు

మోతె, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు సూర్యాపేట జిల్లా మోతె ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం పక్కా సమాచారంతో సిబ్బందితో కలిసి వాగులో ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో వెళ్లగా అన్నారిగూడెం సమీపంలో ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. వాటిని స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశామన్నారు. మండలకేంద్రంలోని డబుల్‌బెడ్ రూంల వద్ద పేకాడుతున్న గ్రామానికి చెందిన ముగ్గురిని పట్టుకుని వారి వద్ద ఉన్న రూ.1900 నగదు, పేక ముక్కలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేయడం చేశామని ఎస్ఐ తెలిపారు.

మూసీలో చిక్కుకున్న పశువుల కాపరులు

నలుగురిని కాపాడిన రెస్క్యూటీం



రెస్క్యూ ఆపరేషన్ ద్వారా పశువుల కాపరులను కాపాడిన పోలీసులు

వలిగొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి జిల్లా వలిగొండ మండలం ప్రొద్దుటూరు గ్రామంలో మూసీ వాగులో చిక్కుకున్న నలుగురు పశువుల కాపరులను పోలీసులు, రెస్క్యూటీం సోమవారం రాత్రి రక్షించింది. గ్రామంలోని మూసీవాగు ప్రాంతంలో ఉన్న నానబోని బండలు ప్రాంతంలో గ్రామానికి చెందిన పెద్దబోయిన బుచ్చయ్య, పల్సం ప్రశాంత్, పల్సం తరుణ్, గజ్జి శ్రీను పశువులను మేపేందుకు సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో వెళ్లారు. హైదరాబాద్ కురిసిన భారీ వర్షానికి మూసీ వాగు ఒక్కసారిగా ఉధృతంగా ప్రవహించింది. దీంతో ఈ నలుగురు మూసీ వాగులో చిక్కుకున్నారు. దీంతో ఆందోళన వీరు సుమారు 7గంటల ప్రాంతంలో వీరి వద్ద ఉన్న సెల్ ఫోన్ ద్వారా డయల్100కు సమాచారం ఇచ్చారు. స్పందించిన పోలీసులు ఫైర్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వీరంతా వెంటనే మూసీ ప్రాంతానికి చేరుకొని సహాయక చర్యలు చెపట్టారు. మొత్తం మూడు గంటలపాటు నిర్వహించిన రెస్క్యూ ఆపరేషన్‌తో నలుగురు పశువుల కాపరులను సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు. సంఘటనా స్థలానికి డీసీపీ అక్షాంశ్‌యాదవ్, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, వలిగొండ తహసీల్దార్ దశరథ, ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తదితరులు సందర్శించారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

చిట్యాలరూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా చిట్యాల ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మండలంలోని పెద్దకాపర్తి గ్రామశివారులోని తిరుమలరాయుని దేవస్థానం గుట్టపై కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడిచేశామన్నారు. పేకాట ఆడుతున్న పెద్దకాపర్తికి చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసి వారి నుంచి రూ.5,850 నగదు, మూడు ద్విచక్రవాహనాలు, ఓ స్కూటీ, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులకు పింఛన్ పథకం



» పీఎం కిసాన్ మాన్‌ధన్ యోజన
» 18 నుంచి 40 ఏళ్ల రైతులు అర్హులు
» ప్రీమియం రూ.55 నుంచి రూ.200
» బీమా కంపెనీకి రైతు ప్రీమియానికి సమానంగా ప్రభుత్వం చెల్లింపు

కాయకష్టంతో దేశానికి అన్నం పెట్టే రైతులు వయస్సుడిగిన తర్వాత పింఛన్‌పొందే పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. ప్రధాన మంత్రి కిసాన్ మాన్ ధన్ యోజన పేరుతో తీసుకువచ్చిన ఈ పథకం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందంటున్నారు. ఈ పథకంతో సన్న, చిన్నకారు రైతులకు ఆర్థిక భరోసాతో పాటు కుటుంబానికి ఆర్థికభారం నుంచి కొంత వెసులుబాటు కలుగనుంది.

- (ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

కేంద్ర ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులకు వృద్ధాప్యంలో అండగా నిలిచేందుకు పీఎం కిసాన్ మాన్‌ధన్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద రైతుకు 60 ఏళ్ల దాటాక ప్రతినెలా రూ.9 వేల చొప్పున జీవితకాలం పింఛన్ అందుతుంది. ఈ పథకంలో లబ్ధి పొందడానికి 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న రైతులు అర్హులు. తమ పేరు మీద భూమి పట్టాఉండి, ఐదెకరాల వరకు సాగయ్యే భూమి ఉన్నవారు ఈ పథకంలో పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఎప్పుడు పేరు నమోదు చేసుకున్నా 60 ఏళ్ల దాటాకే పింఛన్ వస్తుంది. ఈ పథకంలో చేరే వారు వారి వయస్సును బట్టి నెలనెలా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. రైతు చెల్లించిన ప్రీమియం డబ్బుతో సమాన డబ్బు కేంద్ర ప్రభుత్వం తనవంతుగా బీమా కంపెనీకి చెల్లిస్తోంది.

ఉన్నత ఆర్థికస్థితి ఉన్నా, టాక్స్ చెల్లిస్తున్నా అనర్హులు

నేషనల్ స్కీం, ఈఎస్ఐ స్కీం, ఈపీఎఫ్‌వో పరిధిలోని వారు, ఏదైనా చట్టబద్ధ సామాజిక భద్రతా పథకాల్లో ఉన్నవారు, మంచి ఆర్థిక స్థితి కలిగిన వారు, ఆదాయపన్ను చెల్లింపుదారులు ఈ పథకంలో చేరడానికి అనర్హులు.

ప్రీమియం వివరాలు ఇలా

ఈ పథకంలో చేరడానికి 18 నుంచి 40 ఏళ్లలోపు రైతులు అర్హులు. పథకంలో చేరిన నాటి నుంచి ప్రతి నెలా రైతు అతడి వయస్సును బట్టి బీమా కంపెనీకి నిర్ణయించిన ప్రీమియం ప్రతి నెలా చెల్లించాలి. రైతు చెల్లించిన ప్రీమియానికి సమానంగా ప్రభుత్వం నగదు బీమా కంపెనికి చెల్లిస్తోంది. 18 ఏళ్ల రైతు నెలకు రూ.55 చొప్పున ప్రీమియం చెల్లించాలి. కేంద్ర ప్రభుత్వం కూడా రూ.55 చెల్లిస్తుంది. 19ఏళ్లవారు రూ.58, 20 ఏళ్ల వారు రూ.61, 21ఏళ్లకు రూ.64, 22 ఏళ్లకు రూ.68, 23 ఏళ్లకు రూ.72, 24 ఏళ్లకు రూ.76, 25 ఏళ్లకు రూ.80, 26 ఏళ్లకు రూ.85, 27 ఏళ్లకు రూ.90, 28 ఏళ్లకు రూ.95, 29 ఏళ్లకు రూ.100, 30 ఏళ్లకు రూ.105, 31 ఏళ్లకు రూ.110, 32 ఏళ్లకు రూ.120, 33 ఏళ్లకు రూ.130, 34 ఏళ్లకు రూ.140, 35 ఏళ్లకు రూ.150, 36 ఏళ్లకు రూ.160, 37 ఏళ్లకు రూ.170, 38 ఏళ్ల వారు రూ.180, 39 ఏళ్ల వారు రూ.190, 40 ఏళ్ల వారు రూ.200 చొప్పున ప్రతి నెలా 60 ఏళ్ల వరకు చెల్లించాలి. 60 ఏళ్లు దాటాక పింఛన్ వస్తుంది. మధ్యలో రైతు మరణిస్తే భార్య ఈ పథకాన్ని కొనసాగించవచ్చు. ఆమెకు పింఛను అందుతుంది. 60 ఏళ్ల తర్వాత రైతు మరణిస్తే భార్యకు రూ.1500 పింఛను ఇస్తారు.

ప్రచార లోపం...

పీఎం కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం రైతులకు ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ ప్రచారలోపం కనిపిస్తోంది. ఈ పథకం గురించి రైతులకు ఎవరూ అవగాహన కల్పించడం లేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ పథకంపై రైతులకు అవగాహన కల్పిస్తే బాగుంటుందంటున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి ఇలా

పీఎం కిసాన్ లబ్ధిదారులు కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ)కు వెళ్లి పీఎం కేఎంవై పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రైతు మొదట తన ఆధార్‌కార్డు నంబరు ఎంటర్‌చేయాలి. పీఎం కిసాన్ పథకానికి నమోదైన బ్యాంకు ఖాతా నుంచి ప్రీమియం డబ్బు చెల్లించాలి. ఆ తర్వాత ప్రతి నెలా ఆటోమెటిక్‌గా ప్రీమియం డబ్బులు ఆ ఖాతా నుంచి పీఎంకేఎంవై పథకానికి జమవుతాయి. నామినీ వివరాలు నమోదుచేయాలి. పీఎం కిసాన్ మాన్‌ధన్ దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని రైతు సంతకం చేసి పోర్టల్లో అప్‌లోడ్ చేయాలి. వెంటనే పీఎం కిసాన్ మాన్‌ధన్ పింఛన్ కార్డు జనరేట్ అవుతోంది. కార్డు డౌన్‌లోడ్ చేసుకోవాలి. పీఎం కిసాన్ లబ్ధిదారులు కాని వారు సీఎస్‌సీలో మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకుని పింఛన్‌కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మొదట ప్రీమియం డబ్బు నగదు రూపంలో చెల్లించి, ఆ తర్వాత బ్యాంకు ఖాతాను అనుసంధానం చేయాలి. రైతు ఫొటో, నివాస ధ్రువీకరణ పత్రం, సాగు భూమి, ఆదాయం తదితర వివరాలను నమోదు చేయాలి.

గుర్తుతెలియని వాహనాన్ని విక్రయించిన కానిస్టేబుళ్లు

తిప్పర్తి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో గుర్తు తెలియని ద్విచక్రవాహనాలను పోలీసులు విక్రయిస్తున్న విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. మండలకేంద్రానికి చెందిన ఇద్దరు కానిస్టేబుల్స్ గుర్తుతెలియని ద్విచక్ర వాహనాన్ని విక్రయించి సొమ్ము చేసుకోబోయి దొరికారు. స్థానికులు తెలిపిన విశ్వసనీయ సమాచారం మేరకు తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఇద్దరు పోలీసులు జూలై నెలలో ఓ గుర్తు తెలియని ద్విచక్రవాహనాన్ని తీసుకొచ్చి స్థానిక ద్విచక్రవాహనాన్ని తీసుకొచ్చి మరమ్మతు చేయాలన్నారు. ఇచ్చిన రెండురోజుల తర్వాత మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఆ వాహనాన్ని విక్రయించి మెకానిక్ దగ్గర ఉన్న వాహనాన్ని తీసుకోమని చెప్పారు. ఆ మేరకు ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లిన వ్యక్తి అదే గ్రామంలోని మరో వ్యక్తికి ఆ వాహనాన్ని విక్రయించాడు.

వెలుగుచూసిందిలా...



విక్రయించినట్లు చెబుతున్న వాహనం

పోలీసుల దగ్గర ద్విచక్రవాహనాన్ని కొనుగోలు చేసిన వ్యక్తి పూర్తి డబ్బులు చెల్లించలేదు. దీంతో ఆతడు కలిసినప్పుడు డబ్బులు చెల్లించాలని కానిస్టేబుల్స్ బలవంతం చేశారు. దీంతో ఆ వ్యక్తి నేరుగా పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి కాగితాలు లేని ద్విచక్రవాహనాన్ని తనకు విక్రయించి ఇబ్బంది పెడుతున్నట్లు ఎస్ఐకి చెప్పినట్లు సమాచారం. విషయం తెలిసిన ఎస్ఐ వెంటనే సదరు ద్విచక్రవాహనాన్ని ఎవరు తెచ్చారన్న విషయాలతో పాటు బైకు మెకానిక్‌ను కూడా స్టేషన్‌కు పిలిచి విచారించినట్లు సమాచారం. కాగా మండలంలోని మల్లెవారిగూడెం రోడ్డు పక్కన కొద్దిరోజులుగా గుర్తు తెలియని వాహనం ఉందన్న స్థానికుల సమాచారంతో కానిస్టేబుల్ వెళ్లి వాహనాన్ని స్టేషన్‌కు తరలించినట్లు తెలుస్తోంది. గుర్తుతెలియని ద్విచక్ర వాహనాన్ని కానిస్టేబుల్స్ విక్రయించడంపై ఎస్ఐ శంకర్‌ని వివరణ కోరగా విచారణ చేసి పైస్థాయి అధికారులకు రిపోర్ట్ చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సాగర్‌లో తెలంగాణ లోకాయుక్తకు స్వాగతం



మొక్క ఇచ్చి స్వాగతం పలుకుతున్న ప్రోటోకాల్ ఆఫీసర్ దండా శ్రీనివాస్‌రెడ్డి

నాగార్జునసాగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ హిల్‌కాలనీ విజయవిహార్ అతిథిగృహానికి చేరుకున్న తెలంగాణ లోకాయుక్త న్యాయమూర్తి రాజశేఖర్‌రెడ్డికి ప్రోటోకాల్ ఆఫీసర్ దండా శ్రీనివాస్‌రెడ్డి మొక్కను ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో సోమవారం నుంచి రెండురోజుల పాటు పలు కార్యక్రమాల్లో లోకాయుక్త న్యాయమూర్తి పాల్గొననున్నారు. విజయవిహార్ అతిథి గృహంలో ఆయనకు పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.

రాఖీ తయారీతో ఉపాధి





» తయారీ కేంద్రం ఏర్పాటుతో 150 మందికి ఉపాధి

» దూరప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే రాఖీలు లభ్యం

రాఖీల కొనుగోలుకు ప్రతి ఏటా పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్‌కత్తాకు వెళ్లి హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి ఇక్కడ హోల్‌సేల్, రిటైల్‌గా విక్రయించేవారు. వ్యయ ప్రయాసలతో అంత దూరం వెళ్లి రాఖీలు తెచ్చే బదులు స్థానికంగానే రాఖీ తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని నల్లగొండ జిల్లా చిట్యాల మండలకేంద్రంలో రాఖీ తయారీ కేంద్రం ఏర్పాటు చేసి 150 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వ్యాపారులు వచ్చి రాఖీలు కొనుగోలు చేస్తున్నారు.

– ఆంధ్రజ్యోతి, చిట్యాలరూరల్

చిట్యాలకు చెందిన ప్రొద్దుటూరు రాములు, తన కుమారులు శ్రీనివాస్‌గుప్తా, కిరణ్‌కుమార్‌తో కలిసి శ్రీనివాస జనరల్ స్టోర్‌ను నడుపుతుండేవారు. 30 ఏళ్ల నుంచి తండ్రి దుకాణంలో ఉండగా, కుమారులు సీజనల్ వ్యాపారం రాఖీలు, టపాకాయలు హోల్‌సేల్ వ్యాపారం చేస్తున్నారు. రాఖీల కొనుగోలుకు కోల్‌కత్తా వెళ్లి, టపాకాయలకు శివకాశీ వెళ్లేవారు. తండ్రి కొన్నేళ్ల క్రితం మృతిచెందగా కుమారులిద్దరూ వ్యాపారం చూసుకుంటున్నారు. దూరం ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా రాఖీ తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని చిట్యాలలోనే ఏర్పాటు చేసి 150 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. తయారు చేసేందుకు మహిళలకు రాఖీ మెటీరియల్‌ను ఇంటికి ఇస్తున్నారు. వారు తయారు చేసిన రాఖీలు కేంద్రానికి తీసుకువచ్చి అప్పగిస్తారు. రాఖీల తయారీ ద్వారా స్థానికంగా 130మందితో పాటు కేంద్రంలో విక్రయ సమయంలో పనిచేసే సిబ్బంది మరో 20మందికి ఉపాధి లభిస్తుంది.

13వేల రకాల రాఖీలు

రాఖీ తయారీ కేంద్రంలో 13వేల వివిధ రకాలు రంగురంగుల రాఖీలు తయారు చేశారు. నాటి రోజుల్లో ఉన్న రాఖీలతో పాటుగా ఆధునికతతో



కూడిన కొత్త డిజైన్‌లలో రాఖీలు, చిన్న పిల్లలు ఇష్టపడే విధంగా కూడా రాఖీలు అందుబాటులో ఉన్నాయి. తయారీ సమయంలో రోజుకో కొత్త రకం రాఖీ మెటీరియల్ వచ్చేది. కొనుగోలుదారులు ఆసక్తి చూపేలా 13వేల రకాల రాఖీలను తయారు చేయించారు.

దూరప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే రాఖీలు

కోల్‌కత్తా, హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు వెళ్లి రాఖీలు కొనుగోలు చేస్తుంటారు. ఐదేళ్ల నుంచి చిట్యాలలో పీజేఆర్ రాఖీ కేంద్రం ఏర్పాటుతో దూరప్రాంతాలకు వెళ్లకుండానే స్థానికంగానే రాఖీలు అందుబాటులో ఉంటున్నాయి. దూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా రాఖీతయారీ కేంద్రం ఉందని శ్రీనివాస్‌గుప్తా చెబుతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి రాఖీలను కొనుగోలు చేసేందుకు చాలామంది ఆసక్తిని చూపుతూ రాఖీ కేంద్రానికి వస్తున్నారు.

ఇంట్లో ఉంటూనే ఉపాధి పొందుతున్నాం



రాఖీపండుగ రెండు మాసాలు ఉండగా రాఖీ తయారీకి మెటీరియల్ ఇవ్వడంతో వాటిని తయారు చేస్తుండగా మాకు ఉపాధి లభిస్తుంది. ఇంట్లో పనిచేసుకుని పనికోసం ఎక్కడికో వెళ్ళకుండా ఇంట్లోనే ఉంటూ ఉపాధి పొందుతున్నాం. రాఖీల తయారీకి మెటీరియల్‌ను ఇవ్వగానే వాటిని సరిచేసి తయారు చేశాక ప్యాకింగ్ చేస్తాము. 100 నుంచి 150 డజన్ల వరకు తయారు చేసి ప్యాక్ చేస్తాం. రోజుకు సుమారు రూ.400 వరకు గిట్టుబాటవుతుంది.

– గురిజ పద్మ, చిట్యాల.

అందుబాటు ధరల్లో విక్రయిస్తున్నాం



13వేల రకాల రాఖీలు 10 పైసల నుంచి రూ.100 వరకు ధరలు ఉన్నాయి. హోల్‌సేల్‌గానే విక్రయిస్తున్నాము. రిటైల్‌గా విక్రయించం. వినియోగదారులకు అందుబాటులో అనువుగా ఉండే ధరలు ఆకర్శణీయమైన రాఖీలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటుగా కర్నాటక, మహారాష్ట్ర నుంచి రాఖీలు కోనుగోలు కోసం రావడం ఆనందంగా ఉంది.

– ప్రొద్దుటూరు శ్రీనివాస్‌గుప్తా, పీజేఆర్ రాఖీ తయారీ కేంద్రం యజమాని, చిట్యాల.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

● ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజినీకాంత్



హాలియాలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

హాలియా,ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగారపు రజినీకాంత్ డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్ల సంరక్షణ, ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సంఘర్షణ సైకిల్‌యాత్ర సోమవారం నల్లగొండ జిల్లా హాలియాకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో మార్పు రావాలి.. కాంగ్రెస్ రావాలి అని ఉపన్యాసాలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేని క్యాబినెట్‌గా మార్చారన్నారు. సంక్షేమ హాస్టల్ గురుకులాలు అద్దె భవనాల్లో నడుస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అద్దెలు చెల్లించడం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, కుర్ర సైదానాయక్, కుంచం కావ్య, స్పందన, కోరే రమేష్, ముస్కు రవీందర్, బుడిగ వెంకటేష్, మారుపాక కిరణ్, జగదీష్, జగన్, వీరన్న, రాకేష్, భార్గవ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

రాచకొండ రిజర్వాయర్ ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సంస్థాన్ నారాయణపురం ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చర్లగూడెం ప్రాజెక్టును పూర్తిచేసి రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని కోరుతూ యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మందుగుల బాలకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కలిసి రైతులు వినతిపత్రం అందజేశారు. రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటు చేస్తే చౌటుప్పల్, నారాయణపురం మండలాలకు తాగు, సాగునీటి సౌకర్యం లభిస్తుందన్నారు. బీడు భూములు సాగులోకి వస్తాయన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో నోముల మాధవరెడ్డి, మెగావత్ రెడ్యానాయక్, గూడె మల్లేషం తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో రజత పతకం



చక్రవర్తిని అభినందిస్తున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్ పట్టణంలోని సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా పనిచేస్తున్న గడ్డం కల్యాణ చక్రవర్తి వరంగల్‌లో జరిగిన రెండో తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో (పోర్‌ట్రాయిట్ - పార్లే) నేర పరిశోధన విభాగంలో రాష్ట్ర స్థాయిలో రజత పతకం సాధించారు. ప్రతిభ కనబర్చిన చక్రవర్తిని వరంగల్ సిటీ పోలీస్ కమిషనర్ ఐపీఎస్ సన్‌ప్రీత్‌సింగ్ ఈ నెల 2న రజత పతకం అందజేశారు. కాగా సోమవారం పట్టణంలో సీఐ చరమందరాజు కల్యాణ చక్రవర్తిని అభినందించారు.

గుట్టలో పవిత్రోత్సవాలు ప్రారంభం



పవిత్రోత్సవ పూజలు ప్రారంభిస్తున్న అర్చకులు



యాదగిరిగుట్ట, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో సోమవారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ముఖ మండపంలో వేద మంత్రోచ్ఛరణలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ పవిత్రోత్సవాలు ప్రారంభించి ప్రబంధ పారాయణం, హవనం చేపట్టారు. పాంచరాత్రాగమన శాస్త్రానుసారంగా మూడు రోజుల పాటు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. వాసుదేవ పుణ్యా హవాచనం, రక్షా బంధనం, మృత్యంగ్రహణం, అఖండ దీపారాధన, అంకురారోపణ, అంకురార్పణ హోమం, పవిత్రాదివాసం నిర్వహించారు. దైవారాధనలో దోషాలు, పొరపాట్లు దొర్లితే వాటి నివారణ కోసం దేవ స్థానంలో అర్చక బృందం ఈ ఉత్సవాలు చేపట్టడం ఆచారం. ఆదిపూజ అనంతరం వేడుకలకు అంకురార్పణ చేశారు. రంగు రంగు వర్ణాల్లోని 108 రకాల నూలు పోగులకు ప్రత్యేక పూజలు చేసి పవిత్రలు సిద్ధం చేసివాటిని మంత్రోచ్చరణల మధ్య గర్భాలయంలోని తరలించారు. పాతగుట్ట ఆలయంలో కూడా వార్షిక పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా మొదలయ్యాయి. సాయంత్రం వేదమంత్రాలతో ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ వైభవంగా పూజలు నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా మంగళ, బుధవారాల్లో నిత్య, శాశ్వత కల్యాణాలు, బ్రహోత్సవాలు, లక్ష పుష్పార్చన, సుదర్శన నారసింహ హోమం రద్దు చేశారు.

శివకేశవులకు విశేష పూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి కొండపై సోమవారం శివ కేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి వైష్ణవ పాంచరాత్రాగమ రీతిలో, పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తులను అర్చకులు వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచా మృతాలతో అభిషే కించారు. ఆలయంలోని ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 25,87,838ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

ఉచిత దర్శనం క్యూలైన్‌కు బ్రిడ్జి యోచన

● గుట్ట ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు

యాదగిరిగుట్ట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఉచిత దర్శనం క్యూలైన్‌కు బ్రిడ్జి ఏర్పాటుకు యోచిస్తున్నట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. దేవస్థాన అభివృద్ధిలో భాగంగా టెంపుల్ సిటీ ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ విస్తరణ తర్వాత స్వామివారి సేవ ఆలయ దక్షిణ భాగానికి వెళ్లేందుకు అడ్డుగా ఉన్న గోల్డెన్ క్యూలైన్‌ను తొలగించి భక్తుల ఉచిత దర్శనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా బ్రిడ్జి ఏర్పాటు చేస్తామన్నారు. దక్షిణ భాగంలో స్వామివారి సేవ తిరిగేందుకు వీలు కలుగుతుందన్నారు. టెంపుల్ సిటీ ప్రాంతంలో వేద పాఠశాల నిర్మాణానికి కేటాయించిన స్థలంలో విద్య బోధన, అభ్యాసానికి అనుకూలంగా భవనం నిర్మించాలన్నారు. వైటీడీఏ పరిధిలోని ఆలయ భూముల రక్షణకు సర్వే పనులను పారదర్శకంగా ఉండాలని, సర్వే జరుగుతున్న తీరును తెలుసుకొని పలు సూచనలు చేశారు.

ఈ-ఆఫీస్‌తో విధుల్లో పారదర్శకత

కొత్తగా దేవస్థానంలో ప్రవేశపెట్టిన ఈ-ఆఫీస్ విధానంతో విధుల్లో పారదర్శకత, భక్తులకు అందివ్వాల్సిన సేవల్లో మరింత బాధ్యత పెరుగుతుందని ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్(ఐటీఈ/సీ) శాఖ అధికారులు డిజిటల్ సంతకాల వినియోగం, ఫైళ్ల ఆన్‌లైన్ ట్రాకింగ్ మెరుగుదలకు ఈ-ఆఫీస్ విధానంపై ఆలయ ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. ఈ నెల 15న ప్రారంభించబోయే ఈ కొత్త విధానంతో భక్తులకు వేగంగా, నాణ్యమైన, పారదర్శకంగా సేవలు అందించే సౌకర్యం కలుగుతుందన్నారు. విధుల్లో పారదర్శకత, బాధ్యత పెంచేందుకు, కాగిత రహిత కార్యాలయంగా తీర్చిదిద్దేందుకు ప్రయోజనం చేకూరి విధుల్లో సమర్థత మెరుగవుతుందన్నారు. ఆయన వెంట ఆలయ డీఈవో దోర్బాల భాస్కర శర్మ, ప్రధాన పూజారి కాండూరి వెంకటాచార్యులు, ఎలక్ట్రికల్ ఈఈ ఉడెపు వెంకరామారావు, సివిల్ ఈఈ దయాకర్‌రెడ్డి ఉన్నారు.

ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను క్యాంప్ ఆఫీస్‌గా మార్చొద్దు

● బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాగం వర్షిత్‌రెడ్డి

రామగిరి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా నల్లగొండ పట్టణ నడిబొడ్డులో ఉన్న ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన క్యాంప్ కార్యాలయంగా ఎలా మారుస్తారని బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు మంత్రులు, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు వచ్చినప్పుడు సేదతీరే గెస్ట్‌హౌస్‌ను క్యాంపు కార్యాలయంగా మార్చితే నల్లగొండకు వచ్చే అతిథులు ఎక్కడ బస చేస్తారని ప్రశ్నించారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. మంత్రిగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పటివరకు ఒక్కసారి కూడా నియోజకవర్గ కేంద్రంలో బస చేయలేదన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, బండారు ప్రసాద్, వీరెల్లి చంద్రశేఖర్, పిల్లి రామరాజుయాదవ్, పోతేపాక సాంబయ్య, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంగా మార్చడం సరికాదు : సీపీఎం

నల్లగొండ రూరల్: నల్లగొండ జిల్లాకేంద్రంలోని గడియారం సెంటర్‌లో గల ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను క్యాంపు కార్యాలయంగా మార్చడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గవర్నర్, ఇతర శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు వినియోగించుకునే ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను మంత్రి క్యాంప్ కార్యాలయంగా మార్చడం సరికాదన్నారు. క్లాక్ టవర్ సెంటర్‌లో మంత్రి కార్యాలయం ఏర్పాటు చేసి ప్రజా సమస్యలపై ప్రజలు అక్కడ నిరసన తెలిపితే అడ్డుకునే కుట్ర అని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు నారి ఐలయ్య, డబ్బీకార్ మల్లేష్, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కందాల ప్రమీల, సయ్యద్ హాషం, చినపాక లక్ష్మీనారాయణ, ప్రభావతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ అప్పగించిన ఆర్టీసీ సిబ్బంది

దేవరకొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన ల్యాప్‌టాప్‌ను సిబ్బంది తిరిగి అప్పగించారు. హైదరాబాద్ నుంచి దేవరకొండకు వస్తున్న దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో గుడిపల్లి మండలం కోదండాపూర్ గ్రామానికి చెందిన అనిల్ బస్సులో ల్యాప్‌టాప్ మర్చిపోయి కొండమల్లేపల్లిలో దిగిపోయాడు. సోమవారం బస్సు డిపోకు చేరుకుంది. గమనించిన డ్రైవర్ ఫయాజొద్దిన్, కండక్టర్ అలివేలు మంగ ల్యాప్‌టాప్‌ను డిపో అధికారులకు అప్పగించారు. ప్రయాణికుడు బస్సులో ల్యాప్‌టాప్ మర్చిపోయిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకురాగా విచారణ జరిపి అనిల్‌కు అందజేసినట్లు దేవరకొండ డిపో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులుగౌడ్ తెలిపారు. నిజాయితీని చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది పలువురు అభినందించినట్లు ఆయన తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



పిట్టలగూడెంలో డీ-22 ద్వారా నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

గుర్రంపోడు ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పిట్టలగూడెం వద్ద గల ఎఎమ్మార్పీ డీ-22 ద్వారా సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పని చేస్తోందన్నారు. రైతులకు రైతుభరోసా, మద్దతు ధర, అందుబాటులో ఎరువులు ఉంచినట్లు తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్యయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సూదిని జగదీశ్వర్‌రెడ్డి, చనమల్ల జగదీశ్వర్‌రెడ్డి, కుప్ప అమరేందర్, కమతం జగదీశ్వర్‌రెడ్డి, మేడి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులను ఆదుకోవాలి

నల్లగొండ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాను విడుదల చేసి గీత కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాటిచెట్టు పైనుంచి పడి గాయపడిన కార్మికులకు పాత పద్ధతిలోనే మెడికల్ సర్టిఫికెట్స్ ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు కేటాయించే 26 శాతం మద్యం షాపుల్లో వ్యక్తులకు కాకుండా సొసైటీలకు కేటాయించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు, నాయకులు పల్లె శంకర్, జయరాములు, నరెందర్, వెంకన్న, వనం వెంకన్న, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన

నల్లగొండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో పదోన్నతుల ప్రక్రియలో భాగంగా సోమవారం అర్హత కలిగిన స్థానిక సంస్థల ఎస్జీటీ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లుగా, పీఎస్‌హెచ్‌లుగా పదోన్నతులు పొందే ఉపాధ్యాయుల సర్వీస్ బుక్‌లను, అర్హత సర్టిఫికెట్లను పరిశీలించారు. సబ్జెక్టుల వారీగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో ఉదయం 10నుంచి సర్వీసు పుస్తకాల పరిశీలన మొదలైంది. ఇంగ్లీషు, సాంఘిక, గణితం, బయోసైన్స్ పోస్టులకు 1:4 ప్రకారంగా తాత్కాలిక సీనియారిటీ జాబితాను తయారు చేశారు. షెడ్యూల్ ప్రకారం పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతుంది. ప్రతీ కౌంటర్‌లో ప్రధానోపాధ్యాయుల సమక్షంలో అర్హత సర్టిఫికెట్లను పరిశీలించారు. కొన్ని సబ్జెక్టులలో సీనియారిటీ జాబితాలో తమ పేర్లు లేవని కొందరు ఉపాధ్యాయులు అధికారుల దృష్టికి తీసుకురాగా వెంటనే నివృత్తిచేశారు. దీంతో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఉపాధ్యాయులుతో సందడిగా మారింది. రేపు అన్ని సబ్జెక్టుల సీనియారిటీ తుది జాబితా విడుదల కానుంది. పలు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల సంఖ్యను కూడా వెల్లడించారు.

సాగర్ నీటిమట్టం 586.50 అడుగులు

నాగార్జునసాగర్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ ప్రాజె క్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 586.50అడుగులుగా (302.9125టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి కుడికాలువ ద్వారా 5088 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 8,280 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎ ల్‌బీసీ ద్వారా 1800క్యూసెక్కుల నీటిని, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,664 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 44,132 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 66,407 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీకి పెరిగిన ఇన్‌ఫ్లో

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు సోమవారం మరోమారు ఇన్‌ఫ్లో పెరిగింది. ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో గత వారం రోజులుగా ప్రాజెక్టు ఇన్‌ఫ్లోకు మించి అవుట్‌ఫ్లో కొనసాగుతూ వస్తుంది. ఈ క్రమంలో శని, ఆదివారాల్లో హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరద నీరు దిగువన గల మూసీ ప్రాజెక్టుకు చేరుతోంది. దీంతో ఆదివారం కేవలం 231క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సోమవారం సాయంత్రానికి 1248.48 క్యూసెక్కులుగా నమోదైంది. నాలుగైదు రోజులుగా తగ్గుముఖం పడుతూ వస్తున్న ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం నిలకడగా ఉంది. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 642.90 అడుగులు(3.91టీఎంసీలు)గా ఉంది. ఎగువ నుంచి 1248.48క్యూసెక్కులు ఉండగా ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు 609.84క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

చింతలపాలెం: పులిచింతల పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు(45.77 టీఎంసీలు)కాగా, ప్రస్తుత నీటిమట్టం 173.2919 అడుగులు (43.1584 టీఎంసీలు) ఉంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 24.450క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 17వేల క్యూసెక్కులుగా నమోదైంది.

వారబందీ పద్ధతిలో పెండ్లిపాకల ప్రాజెక్టు నీటి విడుదల

కొండమల్లేపల్లి: పెండ్లిపాకల ప్రాజెక్టు నీటిని వానకాలం పంటల సాగుకు వారబందీ పద్ధతిలో నీటిని విడుదల చేసినట్లు పెండ్లిపాకల ప్రాజెక్టు ఈఈ నెహ్రూ నాయక్ తెలిపారు. సోమవారం పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి ప్రాజెక్టు అధికారులతో కలిసి నీటిని విడుదల చేసి మాట్లాడారు. 120రోజులు వారబందీ పద్ధతిన రోజుకు 40 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలో పెండ్లిపాకల ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయకట్టు పరిధిలో నాలుగు వేల ఎకరాలకు నీరు అందనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈ రమేష్, ప్రాజెక్టు ఏఈలు సంతోష్‌రెడ్డి, భాస్కర్‌రావు, నాయకులు కాసర్ల వెంకటేశ్వర్లు, ఉట్కూరి వేమన్‌రెడ్డి, గంధం సురేష్ పాల్గొన్నారు.



పెండ్లిపాకల ప్రాజెక్టు నీటిని విడుదల చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కొత్త రేషన్‌కార్డుల ప్రొసీడింగ్స్ అందజేత

నార్కట్‌పల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టు గ్రామ పంచాయతీ పరిధిలో ఇటీవల కొత్తగా రేషన్‌కార్డులు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్‌ను గ్రామ పంచాయతీలో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నేత కాని కృష్ణయ్య, పున్నపురాజు యాదగిరి, వారాల రమేష్, గడుసు శశిధర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, రేషన్‌డీలర్ నాగలక్ష్మి, లింగయ్య పాల్గొన్నారు.

ఫార్మసీ రంగంలో సంతోష్‌కు డాక్టరేట్



కట్టంగూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కట్టంగూరుకు చెందిన ఇల్లెందుల సంతోష్‌కు ఫార్మసీరంగంలో డాక్టరేట్ లభించింది. జైపూర్‌లోని శ్యామ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ శైలేష్‌శర్మ పర్యవేక్షణలో వైరస్, క్యాన్సర్ నిరోధక ఔషధాల నిర్ధారణపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ దక్కింది. ప్రస్తుతం సంతోష్ హైదరాబాద్‌లోని ప్రముఖ ఫార్మసీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించరూ..

'ప్రజావాణి'కి తరలివచ్చి వినతులు



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఆపదలో ఉన్నాం.. ఆదుకోండి అంటూ... జిల్లా నలుమూలల నుంచి అనేకమంది బాధితులు ఎన్నో ప్రయాసాల కోర్చి వారం వారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అనేకమంది హాజరయ్యారు. వారిలో కొందరు వ్యక్తిగత సమస్యలపై హాజరుకాగా మరి కొందరు సామాజిక అంశాలపై తరలి వచ్చారు. కాగా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇతర అధికారులతో కలిసి ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. వాటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్ని సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు లేఖలు రాశారు. కాగా ఈ వారం మొత్తం 99కి పైగా రెవెన్యూ అంశాలపై వచ్చిన ఫిర్యాదులే ఎక్కువగా ఉన్నాయి.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ క్రైం)

క్రాప్ లోన్ మంజూరు చేయించండి



అటవీ చట్టం ప్రకారం గత ప్రభుత్వం మాకు ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాలను అందజేసింది. ప్రభుత్వ సహాయంతో కరెంటు బోర్లు వేసుకొని పంటలు పండిస్తూ జీవనం కొనసాగిస్తున్నాం. అయితే పంట రుణాలు, పెట్టుబడుల సహాయం కోసం ప్రైవేట్ వ్యక్తుల నుంచి అధిక వడ్డీకి డబ్బులు తెచ్చి ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నాం. గతంలో పంట రుణాల కోసం అప్పటి కలెక్టరుకు విన్నవించుకోగా లీడ్ బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడి పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి పంట రుణాలు మంజూరు చేయడంతో వాటిని సకాలంలో చెల్లించాం. ఇప్పుడు మాత్రం పంట రుణాలు ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. దయచేసి బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇప్పించగలరు.

- పావురాలగుట్ట గ్రామస్థులు, పీఏపల్లి మండలం

ఇందిరమ్మ ఇంటి బిల్లు ఇప్పించాలి



నేను నిరుపేద కుటుంబానికి చెందినవాడిని. నాకు ఇల్లు లేకపోవడంతో ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాను. ప్రభుత్వం ద్వారా నాకు ఇల్లు మంజూరైంది. దీంతో ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టాను. బేస్‌మెంట్ వరకు పూర్తి చేశాను. బేస్‌మెంట్ అనంతరం రావాల్సిన బిల్లు కోసం అధికారులను సంప్రదించగా ఆధార్ కార్డులో తప్పులు ఉన్నందున బిల్లు మంజూరు చేయడం లేదని పేర్కొన్నారు. దయచేసి ఆధార్ కార్డులో గల తప్పును సవరించి ఇందిరమ్మ ఇల్లు బిల్లును మంజూరు చేయించండి.

- శ్రీనివాస్, మిర్యాలగూడ

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి



నేను నిరుపేద వ్యవసాయకూలీని. నాకు మా గ్రామంలో పూరి గుడిసె ఉండేది. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో నా పేరు మీద ఇల్లు మంజూరైంది. అధికారుల సూచన మేరకు ఇంటి నిర్మాణానికి ముగ్గుపోసేందుకు ఉన్న గుడిసెను సైతం ఎక్స్‌కవేటర్‌తో తొలగించాను. ఇదే క్రమంలో గ్రామంలోని అధికార పార్టీ చెందిన కొంతమంది నాయకులు తన పేరును ఇళ్ల మంజూరైన జాబితా నుంచి తొలగించారు. అన్ని అర్హతలు ఉన్న తనకు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలి.

- గురువమ్మ, బాబాసాయి పేట, త్రిపురారం

వేతనాలు ఇవ్వాలి



జిల్లాలోని పలు మండలాల్లో ఉన్న ఆదర్శ పాఠశాలలో అవుట్ సోర్సింగ్ విధానంలో తామంతా ఎంతో కాలంగా సేవలను అందిస్తున్నాము. అయితే తమకు ఐదు నెలలుగా వేతనాలు రావడం లేదు. ఇదేమిటని ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నిస్తే తమకు ఇంకా అగ్రిమెంట్ కాలేదని చెబుతున్నారు. అసలే చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న తమకు ఐదు నెలల వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు చొరవ చేసుకొని అవుట్ సోర్సింగ్ సిబ్బందికి నెలనెలా వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి తమ ఖాతాలో నేరుగా జీతం వేసేలా చూడాలి.

- మోడల్ స్కూల్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది

చంద్రబాబుకు దాసోహమైన రేవంత్‌రెడ్డి

● ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



మాట్లాడుతున్న లింగయ్య

నార్కట్‌పల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాజకీయ గురువైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దాసోహమయ్యాడని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. ఈ కారణంగానే ఆంధ్ర ప్రాంతానికి నీటిని తరలిస్తున్నారని ఆరోపించారు. నార్కట్‌పల్లిలోని తన నివాసంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వ్యక్తి అయినా జిల్లాకు సాగునీటి విషయంలో తీవ్ర అన్యాయం చేశారని, కృష్ణానీటితో చెరువులను నింపలేకపోయారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు సరిపడా సాగునీటిని అందించిందన్నారు. శ్రీశైలం ద్వారా వచ్చే నీటిని సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. జిల్లాకు ఎన్నోసార్లు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్క పైసా కూడా నిధులు ఇవ్వలేదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే సన్నబియ్యం, రేషన్‌కార్డుల పంపిణీ చేస్తున్నారని చిరుమర్తి ఎద్దేవా చేశారు. చెరువు మట్టిని అమ్ముకునేందుకే నకిరేకల్ నియోజకవర్గంలోని పలు చెరువులను ఎండబెట్టారనిఆరోపించారు. చెర్వుపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని చెరువుల్లో విచ్చలవిడిగా మట్టిని తవ్వి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడం విస్మయం కల్గిస్తుందన్నారు. రాజకీయాలు మాని నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల అవసరాలు తీర్చడంలో ఎమ్మెల్యే దృష్టి పెట్టాలన్నారు.

ఉద్యోగినుల భద్రత కోసం కమిటీలు



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న రిబిక

కనగల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగినుల భద్రత కోసం పని చేస్తున్న ప్రదేశాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలను(ఐసీసీ) ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి రిబిక అన్నారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీల ఏర్పాటులో భాగంగా తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, పీహెచ్‌సీలో సోమవారం అవగాహన సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రిబిక మాట్లాడుతూ పది మంది ఉద్యోగినులు ఉన్నచోట ఐసీసీలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కమిటీలో ఐదుగురు సభ్యులు ఉంటారని, ఉద్యోగినుల భద్రత, లైగింక దాడుల నివారణకు ఈ కమిటీలు కృషి చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో సుమలత, డీటీ పార్వతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

చినుకుల లెక్క తప్పుతోంది!

(5వపేజీ తరువాయి)

కురుస్తున్న వర్షపు చినుకుల లెక్కలనే చెబుతున్నారు. కొన్నిసార్లు వానాకాలంలో భారీ వర్షాలు వచ్చినప్పుడు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నా ఈ లెక్కలు జిల్లా కార్యాలయానికి చేరవేయలేని స్థితిలో మండల సిబ్బంది ఉండటం గమనార్హం.

కరువు పరిస్థితులప్పుడు రైతులకు నష్టమే

సీపీవో కార్యాలయం నుంచి జారీ అవుతున్న వర్షపాతం లెక్కల ఆధారంగానే ఆయా జిల్లాల్లో కరువును ప్రభుత్వం అంచనా వేస్తుంది. మండలం యూనిట్‌గా జారీ చేస్తున్న వర్షపాతం లెక్కలతో ఒక్కోసారి రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. గతంలో ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయినప్పుడు 33శాతానికి పైగా పంట దెబ్బతిన్నప్పుడే ఆయా పంటల వివరాలను, రైతుల పేర్లను నమోదు చేసేవారు. వర్షపాతం విషయంలోనూ అదే పరిస్థితి ఉంది. అధికారులు మండలంలో కురిసిన వర్షాన్ని లెక్కించి లోటు వర్షపాతం లేదని నివేదిక ఇస్తున్నారు. దీంతో చాలా గ్రామాల్లో వర్షాలు లేకున్నా, ఆ వివరాలు మాత్రం ప్రభుత్వానికి చేరడం లేదు. కొన్నేళ్లుగా జిల్లా పరిషత్ సమావేశాలల్లో ప్రజాప్రతినిధులు సైతం ఇదే విషయంపై ఆందోళన వ్యక్తం చేయడంతో పాటు గ్రామాల వారీగా రెయిన్ గేజ్‌లను ఏర్పాటు చేసి వర్షపాతం వివరాలను నమోదు చేయాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు. అయినా ప్రభుత్వం ఆ వైపుగా దృష్టి సారించడం లేదు. పంటల బీమా వర్తింపజేయాలంటే వర్షపాతం లెక్కల ఆధారంగానే అమలవుతుంది. ప్రస్తుతం చాలా మండలాల్లో రెయిన్ గేజ్ పరికరాలు దెబ్బతినడంతో కచ్చితమైన వర్షపాతం లెక్కలు నమోదు కావడం లేదు.

మండలానికి ఒక రేయిన్ గేజ్ మాత్రమే ఉంది

మండలానికి ఒక రేయిన్ గేజ్ మాత్రమే ఉంది. ఆ రేయిన్ గేజ్ ద్వారానే వర్షపాతాన్ని కొలుస్తాం. మండల కేంద్రంలో మాత్రమే ఇది ఏర్పాటు చేశారు. గ్రామాల వారీగా రేయిన్ గేజ్‌లు ఏర్పాటు చేయలేదు. కొత్తగా ఆటోమెటిక్ రేయిన్ గేజ్ పరికరాలు కొన్ని వచ్చాయి. ఆ పరికరాలతో లెక్కింపు చేస్తాం. అదేవిధంగా మండలాల్లో గంటగంటకు కురిసే వర్షాన్ని లెక్కించేందుకు ఆటోమెటిక్ పరికరాలను ఉపయోగిస్తున్నాం.

- సుబ్బారావు, సీపీవో

కార్పొరేట్ వ్యవసాయానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

● రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉజ్జిని యాదగిరిరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఉజ్జిని యాదగిరిరావు

నల్లగొండరూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం కార్పొరేట్ వ్యవసాయాన్ని తీసుకొచ్చే ప్రయత్నానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని రైతు సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సమస్యల పరిష్కారం కోసం రైతులను చైతన్యపరిచేందుకు ఆగస్టు 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా రైతు పోరాట యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రైతాంగం అనేక సవాలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి తలెత్తిందని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం మార్కెట్లను ప్రైవేట్ చేయడాన్ని నియంత్రించడానికి రైతులతో కలిసి ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ఆత్మహత్యలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి, రైతులతో పాటు వారికి కూడా ప్రభుత్వ పథకాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో యూరియా, డీఏపీ కొరతను నివారించాలని, రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉండేలా అధికారులు చూడాలని అన్నారు. ఎండీ మోహినుద్దీన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం, సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య, పల్ల రంగారెడ్డి, వెంకన్న, శేఖర్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ గుడి ఛైర్మన్‌గా భిక్షపతి



నూతన పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్ పల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయ నూతన పాలకవర్గం సోమవారం ఏర్పాటైంది. ఛైర్మన్‌గా విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాధారపు భిక్షపతి ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా ఇడుకుళ్ల బిక్షమయ్య, ప్రజ్ఞాపురం రాములు, కమ్మంపాటి రాములు, మంద గిరిప్రసాద్, నడింపల్లి శ్రీహరి, గౌరవ సలహాదారునిగా బొక్క భూపాల్‌రెడ్డి, యాద వెంకన్నను ఏ కగ్రీవంగా ఎన్నుకున్నారు. తనను మర్యాదపూర్వకంగా కలిసిన నూతనంగా ఎన్నికైన ఆలయ పాలక వర్గం సభ్యులను ఎమ్మెల్యే వీరేశం సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, ఐతరాజు యాదయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, సామ కొండల్‌రెడ్డి, లింగాల రాములు, జెరిపోతుల భరత్, మిర్యాల రాములు, జెనిగె బిక్షం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంగా పోరాడితే అక్రమ కేసులు

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారు ప్రసాద్



గుర్రంపోడు పోలీస్‌స్టేషన్‌లో ఆందోళన చేస్తున్న బీజేపీ నేత బండారు ప్రసాద్

నల్లగొండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యయుతంగా పోరాడితే అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు బండారు ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలో దశాబ్దాల కాలంగా ఉన్న ఆర్‌అండ్‌బీ అతిథిగృహాన్ని క్యాంపు కార్యాలయంగా మార్చుకోవడంతో పాటు మంత్రి వెంకట్‌రెడ్డి పోలీసులతో అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని విమర్శించారు. సోమవారం క్యాంపు కార్యాలయం ప్రారంభించాన్ని నిరసిస్తూ గడియారం సెంటర్‌కు వెళ్తున్న సమయంలో బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి గుర్రంపోడు పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఎంతోమంది ప్రజాప్రతినిధులు, అధికారులకు ఉపయోగపడే అతిథి గృహాన్ని తొలగించి క్యాంపు కార్యాలయం కట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో పిల్లి రామరాజు, బొజ్జ నాగరాజు, రావిరాల వెంకటేశ్వర్లు, గుర్రం వెంకటేశ్వర్లు, సాయి తదితరులు ఉన్నారు.

కనగల్: నల్లగొండ పట్టణంలో మంత్రి క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి కనగల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. మధ్యాహ్నం అనంతరం వారిని వదిలిపెట్టారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి, నాయకులు వీరెళ్లి చంద్రశేఖర్, నూకల వెంకటనారాయణరెడ్డి, పులకరం బిక్షం, దాసరి వెంకన్న, పంతంగి సైదులుగౌడ్, దేవేందర్, మహేష్, రవి, కిషన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



బీజేపీ సంక్షేమ కార్యక్రమాల కరపత్రాన్ని అందజేస్తున్న పార్టీ నేతలు

నార్కట్‌పల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బీజేపీ ఇంటింటికీ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆ పార్టీ నాయకులు నార్కట్‌పల్లి పట్టణంలో పలు వార్డుల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి మోదీ నేతృత్వంలోని కేంద్రంలో గల బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్వాయి భాస్కర్‌రావు, ముంత నర్సింహ, బిల్లకంటి శ్రీకాంత్, వడ్డేగోని రామలింగం, నాగరాజు, రమేష్, పార్థసారథి, శివ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు సురక్షితం



కనగల్: తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న సుమలత

కనగల్, చిట్యాలరూరల్, నార్కట్‌పల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు ఎంతో సురక్షితమని కనగల్ ఎంపీడీవో సుమలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంజమ్మ, సరిత అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కనగల్, చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల్లో నిర్వహించిన అవగాహన సమావేశాల్లో వారు మాట్లాడారు. పుట్టిన వెంటనే ప్రతీ బిడ్డకు ముర్రుపా లు తాగించాలన్నారు. ముర్రుపాలు వ్యాధి నిరోధకశక్తిని పెంచుతాయన్నారు. నవజాత శిశువులకు తల్లిపాలు అమృతం లాంటివని అన్నారు.

● కనగల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తల్లిపాల యొక్క ఆవశ్యకతను గర్భిణులకు వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి వీరబాబు, అంగన్‌వాడీ టీచర్లు, టీచర్లు శ్రీదేవి, రేణుక, సుజాత, ఏఎన్ఎం గీత తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలోని సుంకెనపల్లిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాల యొక్క ఆవశ్యకతను గర్భిణులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచరు అహల్య, భాగ్యమ్మ, రజిత, సంధ్య పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండలంలోని దాసరిగూడెం, అక్కెనపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన తల్లి పాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంజమ్మ, సరిత మాట్లాడారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాన్ని చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గీతాంజలి, గాజుల జానకమ్మ, వైద్యురాలు నిఖిత, అంగన్‌వాడీ టీచర్లు సునీత, నిఖిత, విజయ, ప్రభావతి, భారతి, శ్రీనివాస్, పద్మ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

చెరువు భూములను పరిరక్షించాలి

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చెరువు భూముల పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని, చెరువు భూములను కబ్జా చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. మునుగోడు పెద్దచెరువు కట్టపై సోమవారం మార్నింగ్ వాక్ చేశారు. చెరువు, ఆయకట్టు, అలుగు, కట్టను రెవెన్యూ, ఎంపీడీవో, నీటి పారుదల శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. కట్టపై ఆవరించిన కంపచెట్లను తొలగించుకుంటూ ఎమ్మెల్యే ముందుకు వెళ్లారు. చెరువు భూములు అక్రమకబ్జాలకు గురైనట్లు కొందరు ఎమ్మెల్యే దృష్టికి తేవటంతో స్పందించి, అక్కడే చెరువు నమూనా మ్యాప్ చూసిన ఆయన చెరువు అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. సత్వరమే సర్వే చేసి హద్దులు నిర్ధారించటంతో పాటు చెరువు భూమి, ఎఫ్‌టీఎల్ భూమి ఎంత విస్తీర్ణంలో ఉన్నదో నివేదిక సమర్పించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. చెరువు పూడిక తీసి, సుందరీకరణ చేస్తామని తెలిపారు. చెరువులు నింపేందుకు కార్యాచరణతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రజల ఆరోగ్యాలకు హానికరమైన కల్తీ పదార్థాల విక్రయాలను నియంత్రించేందుకు విస్తృత తనిఖీలు చేయాలని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆదేశించారు. మునుగోడులోని అంబేడ్కర్ చౌరస్తాలో వివిధ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ రకాల తినే ఆహార పదార్థాల్లో ఏం సరుకులు వాడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రాణంతకమైన కల్తీని నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట మునుగోడు ఇన్‌చార్జి తహసీల్దార్ నేలపట్ల నరేష్, ఇన్‌చార్జి ఎంపీడీవో విజయ్‌భాస్కర్, నీటిపారుదల శాఖ డీఈ ప్రేమ్‌కుమార్, సర్వేయర్ నాగేశ్వరరావు ఉన్నారు.

టైం పాస్ చేసే అధికారులు ఉండొద్దు

మునుగోడు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలన్న తన ఉద్దేశ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ, పనిపై చిత్తశుద్ధి, నిబద్ధత ఉన్న అధికారులే ఇక్కడ ఉండండి.. మొక్కుబడి విధులతో టైంపాస్ చేసే అధికారులు మాత్రం ఇ క్కడ ఉండవద్దని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు తాగునీటి విషయంలో అలసత్వం చూపవద్దన్నారు. శుద్ధి చేసిన మిషన్ భగీరథ నీటిని అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని చె ప్పారు. చౌటుప్పల్ మునిసిపాలిటీ, సంస్థాన్‌నారాయణపురం మండల పరిధిలోని గ్రామాలకు పెరిగిన జనాభాకు అనుగుణంగా తాగునీటి సరఫరా చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆ దిశగా ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మిషన్ భగీరథ ఈఈలు కరుణాకరన్, లక్ష్మీనారాయణ, శాంతికుమారి, డీఈలు దీ న్‌దయాల్, సంపత్, చౌటుప్పల్ మునిసిపల్ మాజీ ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఏఈలు పాల్గొన్నారు.

మెనూ పారదర్శకంగా అమలు చేయాలి


హాస్టళ్లలో విద్యార్థులకు నిర్దేశించిన మెనూ పారదర్శకంగా అమలుచేయాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం హాస్టల్ వార్డెన్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో హాస్టల్ భవనాలు, మౌలిక సౌకర్యాలు, విద్యార్థుల ఆరోగ్యం వంటి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై వార్డెన్లు శ్రద్ధ చూపాలన్నారు. ఆహారం నాణ్యత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. వసతిగృహంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికలు, బాలుర హాస్టళ్ల వార్డెన్లు పాల్గొన్నారు.

జడ్పీహెచ్‌ఎస్‌కు కంప్యూటర్ల బహూకరణ

నార్కట్‌పల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే పాఠశాలకు చెందిన 1986-87 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వవిద్యార్థులు 5 కంప్యూటర్లను బహూకరించారు. పూర్వ విద్యార్థులుగా పాఠశాల అభివృద్ధిలో భాగంగా ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సాంకేతిక విద్య అందించడం కోసం సుమారు రూ.70 వేల విలువైన 5 కంప్యూటర్లను సోమవారం పాఠశాల హెచ్‌ఎం రాములుకు అందజేశారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొడిమాల కృష్ణ, కంభంపాటి రాములు, కేమ వెంకటేష్, వనజారాణి, ఉపాధ్యాయులు శ్యామల, ఆరోగ్యమ్మ, శేఖర్‌రెడ్డి, రామస్వామి, వెంకట్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా యాదగిరి

కట్టంగూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరు ఇన్‌చార్జి తహసీల్దార్ యాదగిరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేసిన వెంకటేశ్వర్‌రావు స్థానంలో నకిరేకల్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పి.యాదగిరికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.50 (302.9125)	66,407	44,432
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.90 (3.91)	1,248.48	668.44
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.2919 (43.1584)	24,450	17,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.170 | స్కిన్‌లెస్ : రూ.190



రెయిన్ గేజ్ పరికరాలు

చినుకుల లెక్క తప్పుతోంది!

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షపాతం కొలతలపై గందరగోళం నెలకొంది. గ్రామం యూనిట్‌గా కాకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకొని రెయిన్ గేజ్‌ల ద్వారా వర్షపాతాన్ని నమోదు లెక్కిస్తున్నారు. అయితే మండలంలో, లేదంటే ఆ మండలంలోని శివారులో ఏదో ఒక ప్రాంతంలో రెయిన్ గేజ్ ఏర్పాటు చేశారు. ఇవి కేవలం ఆ ప్రాంతంలో కురిసిన వర్షపాతాన్ని మాత్రమే లెక్కిస్తున్నాయి. దీన్నే మండల వర్షపాతంగా పరిగణనలోకి తీసుకుంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- మండలం యూనిట్‌గానే వర్షపాతం నమోదు
- గ్రామాల వారీగా వర్షపాతం లెక్కింపుపై దృష్టిసారించని ప్రభుత్వం
- పరికరం ఉన్న ప్రాంత వర్షపాతమే మండలం మొత్తం ఉన్నట్లు లెక్కలు

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రేయిన్ గేజ్ ఉంటే ఆ ప్రాంతంలో కురిసిన వర్షాన్ని మండల సగటు వర్షపాతంగా లెక్కిస్తున్నారు. మండలంలోని ఇతర గ్రామాల్లో వర్షం లేకున్నా, ఆ మండలం మొత్తం వర్షం కురిసినట్లుగా అధికారులు లెక్కలు వేస్తారు. రేయిన్ గేజ్‌ను మాన్యువల్‌తో పాటు ఆటోమెటిక్‌గా లెక్కించే వాటిని ఏర్పాటు చేశారు. రెయిన్ గేజ్‌పై వాతావరణ శాస్త్రవేత్తలతో పాటు హైడ్రాలజిస్ట్‌లకు అవగాహన ఉంటుంది. మండలాల వారీగా ఏర్పాటు చేసిన రెయిన్ గేజ్‌లలో ఆ ప్రాంతంలో కురిసిన వర్షపాతాన్ని మండల కార్యాలయంలో పనిచేసే ఉద్యోగి సేకరించి నివేదిక పంపిస్తారు. వర్షపు నీరును అంగుళాలు లేదంటే మీటర్లలో కొలుస్తారు. వాస్తవానికి మాన్యువల్ రెయిన్ గేజ్ కంటే ఆటోమెటిక్ రెయిన్ గేజ్ కచ్చితమైన కొలతలు ఇస్తాయని పేర్కొంటున్నప్పటికీ కొలతల్లో తేడాలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 72 మండలాల్లో ఈ రెయిన్ గేజ్‌లు ఏర్పాటు చేశారు. రెయిన్ గేజ్‌లలో సేకరించిన నీటిని సిలిండర్ ద్వారా కొలుస్తారు. ఈ సిలిండర్లలో 25మి.మీల వరకు వర్షపాతం కొలిచే అవకాశం ఉంటుంది.

మిల్లీమీటర్లు లేదా సెంటీమీటర్లలో..

వర్షపాతాన్ని మిల్లీమీటర్లు లేదా సెంటీమీటర్లలో కొలుస్తారు. 10మి.మీలు వర్షపాతం కురిస్తే 1సెం.మీగా నమోదు చేస్తారు. వర్షపాతం నమోదును బట్టి ఎల్లో, ఆరెంజ్, రెడ్ అలర్ట్‌ను వాతావరణ శాఖ ప్రకటిస్తుంది. మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిస్తే ఎల్లో అలర్ట్‌ను, తెలికపాటి జల్లుల నుంచి వర్షాలు కురిస్తే గ్రీన్ అలర్ట్‌ను జారీ చేస్తుంది. ప్రస్తుతం ఉన్న రేయిన్ గేజ్‌లతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాన్ని కచ్చితంగా అంచనా వేయడం కష్టంగా ఉంది. కురుస్తున్న వర్షాలు నమోదవుతున్న లెక్కల్లో భారీ తేడాలు ఉండటంతో వర్షపాతం లెక్కలపై అయోమయం నెలకొంటోంది. ఆగస్టు మాసంలో మోస్తరు వర్షాలు తప్ప భారీ వర్షాలు నమోదు కాలేదు. దీంతో చెరువుల, కుంటలు నిండని పరిస్థితి ఉంది. సోమవారం జిల్లా వ్యాప్తంగా 21.8 సెం.మీల సగటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు లెక్కలు చూపారు. ఈ నెలలో తొమ్మిది మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు అధికారులు చూపారు. అయితే ఆ మండలాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే వర్షాలు అంతగా లేని పరిస్థితి ఉంది. 15 మండలాల్లో ఆగస్టులో సాధారణ వర్షపాతం నమోదైందని సీపీవో కార్యాలయం నుంచి నివేదిక ఇచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులను అంచనా వేయకుండానే సంవత్సరాల తరబడి మండల కేంద్రాల్లో..

- మిగతా 8వ పేజీలో...

● పవిత్రోత్సవాలు ప్రారంభం



7

గుట్ట ఆలయంలో పవిత్రోత్సవాల ప్రారంభం సందర్భంగా స్వస్తి వాచనం నిర్వహిస్తున్న అర్చకులు

నిర్లక్ష్యంతో నిరుపయోగం



- ఎకరాల కొద్దీ ఎన్నెస్పీ భూములు
- ఖాళీగా కోట్ల విలువైన క్వార్టర్స్
- శిథిలావస్థకు చేరిన ఇళ్లు
- ఇళ్లలోకి వస్తున్న క్రిమి కీటకాలు
- బెంబేలెత్తుతున్న కాలనీ వాసులు

6

పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి:కలెక్టర్



మిర్యాలగూడలో ఓపీ రికార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో ఎమ్మెల్యే బీఎల్ఆర్

నల్లగొండ(కలెక్టరేట్), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలను పకడ్బందీగా అమలుచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆమెప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మండలాల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు ప్రభుత్వ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లను సవాల్‌గా తీసుకొని సందర్శించాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు వారి మండలంలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు మోడల్ పాఠశాలలను సందర్శించి సమస్యలు లేకుండా చూడాలన్నారు. విద్య, వైద్యం, పరిపాలన అంశాల్లో మండలాల ప్రత్యేక అధికారులది కీలకపాత్ర అని అన్నారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణఅమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, డీఆర్‌డీవో నాగిరెడ్డి, ఆర్డీవోలు వై.అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతిని పెంచాలి

గుర్రంపోడు ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతి తీసుకువచ్చేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. గుర్రంపోడు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఎక్కడైనా ఇసుక, లేబర్ సమస్య ఉంటే తహసీల్దార్‌తో మాట్లాడి పరిష్కరించాలని ఎంపీడీవోకు సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆస్పత్రి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి ఆవరణలో నిర్మిస్తున్న నూతన భవనాన్ని రెండు నెలల్లో పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిని ఎమ్మెల్యే బీఎల్ఆర్‌తో కలిసి ఆమె పరిశీలించి వైద్యసేవలను సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో 125 పడకలు అందుబాటులో ఉన్నాయని, నూతన భవన నిర్మాణ పనులు పూర్తయితే ఆస్పత్రి సామర్థ్యం 200 పడకలకు విస్తరిస్తుందన్నారు. నూతన భవన నిర్మాణం కోసం ఇప్పటికే రూ.4.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పెరిగిన ఆస్పత్రి సామర్థ్యానికి అనుగుణంగా రూ.35లక్షల వ్యయంతో నూతనంగా 160 కేవీ జనరేటర్ మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అదేవిధంగా శానిటేషన్ చర్యలు మెరుగుపరిచేందుకు మరో ఏడుగురు అదనపు సిబ్బందిని నియమించుకునేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఆమె వెంట సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీసీహెచ్‌వో డాక్టర్ మాతృనాయక్, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ సమరద్, తదితరులు ఉన్నారు.

బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి

ఎస్పీ శరత్‌చంద్రపవార్



గ్రీవెన్స్‌డేలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించి 48 మంది అర్జీదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఫోన్‌లో అధికారులతో మాట్లాడారు. ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో పోలీసులను నేరుగా కలవాలని, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని సూచించారు.

నల్లగొండను విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతాం

- రెసిడెన్షియల్ స్కూల్ రాష్ట్రంలోనే మొదటిది కావాలి
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాను విద్యా హబ్‌గా తీర్చిదిద్దుతామని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని గంధవారిగూడెంలో రూ.200కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులకు మంత్రి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి చేపట్టిన బృహత్తర పాఠశాల యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల అని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం రూ.20వేల కోట్లతో ఇలాంటి పాఠశాలలను డిజైన్ చేసి నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోనే నల్లగొండ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల మొదటిదని, ఇది రికార్డు సృష్టించాలని అన్నారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌తో పోటీపడి ఈ పాఠశాల నిర్మాణాన్ని వేగంగా చేపట్టి బాగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలని అన్నారు. విద్య, ఉపాధిలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రస్తుతం నల్లగొండలో బాలికలకు ఉద్దేశించి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరు కాగా, బాలురకు కూడా ఇలాంటి పాఠశాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో కూడా త్వరలోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులకు భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ నల్లగొండ యంగ్ ఇండియా ఇంటిగ్రేటె డ్ రెసిడెన్షియల్ పాఠశాలను 25 ఎకరాల్లో నిర్మించనున్నట్లు తెలిపారు. నాగార్జునసాగర్ నియోజకవర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలకు మంచి స్థలాన్ని గుర్తించామని, త్వరలోనే అక్క డ శంకుస్థాపన పనులు చేపట్టనున్నట్లు వెల్లడించా రు. టీజీఈడబ్ల్యూ ఎంఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలప్రసాద్ నల్లగొండలో నిర్మిస్తున్న యంగ్ ఇండి యా రెసిడెన్షియల్ పాఠశాల వివరాలను తెలియజేశారు.

అందరికీ అందుబాటులో క్యాంపు కార్యాలయం

అందరికీ అందుబాటులో ఉండే విధంగా గడియారం సెంటర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని నిర్మించామని, ఈ కార్యాలయం ఒక ఎమ్మెల్యేకే కాకుండా ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలకు నల్లగొండకు వచ్చినప్పుడు వసతి ఉండేలా నిర్మించామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో సోమవారం రూ. 13కోట్ల వ్యయంతో నిర్మించిన క్యాంపు కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ కార్యాలయానికి ఇందిరా భవన్‌గా నామకరణం చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా నడుస్తున్నాయన్నారు. నకిరేకల్ నియోజకవర్గానికి తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రూ.20 కోట్లు మంజూరు చేస్తూ ఫైల్‌పై సంతకం పెట్టినట్లు తెలిపారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పథకాల గురించి వివరించారు.

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. గుర్రంపోడు బ్రిడ్జీని నిధులు మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్, ఎమ్మెల్యే వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, నారాయణఅమిత్, నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి, విద్యాశాఖ అధికారి భిక్షపతి, టీజీఈడబ్ల్యూ ఐడీసీడీఈ శైలజ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ హఫీజ్‌ఖాన్, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు కోసం ఉద్యమాలు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరభద్రం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

నల్లగొండ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వాగ్దానాల అమలు కోసం ఉద్యమాలు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నల్లగొండ పట్టణంలోని అలకాపురి కాలనీలోని కోటిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 11సంవత్సరాలుగా ప్రజా సమస్యలను పరిష్కరించకుండా భావోద్వేగాలను రెచ్చగొడుతూ విధ్వంసకర పాలన చేస్తోందని ఆరోపించారు. బీజేపీ పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్య పరచాలన్నారు. సామ్రాజ్యవాదం, కార్పొరేట్లకు మోదీ లొంగిపోయాడని ధ్వజమెత్తారు. పహల్గాం దాడి జరుగుతున్న విషయం ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా ప్రధానికి ముందే తెలుసని, ఇందులో భాగంగా ప్రధాని పర్యటన రద్దు చేసుకుని, పర్యాటకులకు ఎందుకు అనుమతించారని ప్రశ్నించారు. దేశ పరువు దిగజారే విధంగా ట్రంపు వ్యవహరిస్తున్నా ఆ వ్యాఖ్యలను తిప్పికొట్టేందుకు ప్రధాని మోదీ నోరు ఎందుకు మెదపడం లేదో చెప్పాలన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేయకుండా కాళేశ్వరం బనకచర్ల పేరిట ప్రజల దృష్టి మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలప్పుడు రాష్ట్రం ఎంత అప్పులో ఉందో రేవంత్‌రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. అలాంటప్పుడు ఆచరణలో అమలు కాని హామీలు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. ఇప్పుడు ఆ హామీలు అమలు చేసేందుకు నిధుల కొరత పేరిట తప్పించుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేసేంతవరకు గ్రామస్థాయిలో ప్రజలను చైతన్య పరిచి ఉద్యమాలు చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక సమస్యలపై భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలు చేయబోతున్నట్లు తెలిపారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలలో గ్రామస్థాయిలో ప్రజా సమస్యలను అధ్యయనం చేసి, వాటి పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో ఉద్యమాలు చేయాలని కోరారు. ఈనెల 6వ తేదీ నుంచి 15 వరకు సమస్యలపై సర్వేలు, అధ్యయన బృందాలతో పర్యటన చేయాలన్నారు. ఈ నెల 10నుంచి 20 వరకు సంతకాల సేకరణ, 20 నుంచి 30 వరకు సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు, గ్రామపంచాయతీల వద్ద ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1న తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాలు, ముట్టడి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ కొనసాగుతోందని, పెండింగ్‌లో ఉన్న రైతుబంధు, రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలని కోరారు. రైతులకు యూరియా కొరత రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు అందుబాటులో యూరియా ఉంచాలన్నారు. గ్రామాల్లో కొందరికి మాత్రమే ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇచ్చే విధంగా లిస్టులు తయారు చేయడం సరైనది కాదని అన్నారు. అందరికీ పక్కా గృహాలు ఇవ్వాలని కోరారు. సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, కందాల ప్రమీల, బండ శ్రీశైలం, చినపాక లక్ష్మీనారాయణ, సయ్యద్ హాషం, వీరేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏఎమ్మార్పీ డీ-39, డీ-40 కాల్వలకు

నీరందించాలి



నీటిపారుదల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నల్లగొండ కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఏఎమ్మార్పీ డీ-39, డీ-40 కాల్వలకు నీరందించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తిప్పర్తి, మాడుగులపల్లి మండలాల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన రైతుల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నీటిపారుదల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల పోరాటం చేసి సాధించుకున్న ఈ ప్రాంత ప్రజలకు ఏఎమ్మార్పీ కాల్వ ద్వారా నీళ్లు అందించకుండా ప్రభుత్వం ఈ ప్రాంత రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఓవైపు బ్రాహ్మణ వెల్లెంల, అయిటిపాముల కాల్వలకు పూర్తిస్థాయిలో నీరందిస్తూ తిప్పర్తి, మాడుగులపల్లి ప్రాంత మండలాల రైతులపై వివక్ష చూపుతోందని అన్నారు. వారబందీ అమలు చేస్తున్నామంటూ అధికారులు పూర్తిస్థాయిలో తిప్పర్తి, మాడుగులపల్లి మండలాలకు వచ్చే కాల్వలకు నీరు వదలటం లేదన్నారు. ఐటి పాముల బ్లాక్‌కు వెళ్లే షెటర్లను, కొంతమంది దుండగులు ధ్వంసం చేసినా అధికారులు వాటిని రిపేర్ చేయించకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు.

ధ్వంసమైన షెటర్ల ద్వారా కిందికి వెళ్లిపోయి పూర్తిస్థాయిలో తిప్పర్తి, మాడుగులపల్లి మండలాలకు సాగు నీరు అందక, చెరువు కుంటల్లో నీరు లేక భూగర్భ జలాలు పడిపోయాని ఆందోళన వ్యక్తం చేశారు. తిప్పర్తి మండలం తనకు గుండెకాయ లాంటిదని తెలిపే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఈ ప్రాంత రైతుల గోస కనపడటేదా? వినిపించడం లేదా? అని ప్రశ్నించారు. మంత్రి నిర్లక్ష్యంతో వందల టీఎంసీలు సాగర్ నుంచి సముద్రం పాలవుతున్నా అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి పూర్తిస్థాయిలో పానగల్ ఉదయ సముద్రానికి నీరు అందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, డి-39, డి-40 కాల్వల ద్వారా చివరి భూముల వరకు పూర్తిస్థాయిలో నీరందించి చెరువులు, కుంటలను నింపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కందుల లక్ష్మయ్య, ముకిరాల కృష్ణ, గుండెబోయిన రామచంద్రు, గుండెబోయిన నాగరాజు, దేవిరెడ్డి లింగారెడ్డి, బొల్లెద్దు వెంకన్న, అంతటి చెన్నకేశవులు, చింతకుంట దయాకర్ రెడ్డి, కే.సురేందర్‌రెడ్డి, చెదురుపల్లి జనార్ధన్, చిన్నగోని వెంకన్న రొట్టెల జానయ్య, జక్కలి రవి, కట్ట బిట్టు పాల్గొన్నారు.

నేడు కాళేశ్వరం ప్రాజెక్టుపై వీడియో ప్రదర్శన


నల్లగొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రత్యక్ష వీడియో ప్రదర్శన ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రత్యక్ష వీడియో ప్రదర్శన ఇవ్వనున్నారని తెలిపారు. ఈ వీడియో ప్రదర్శనను తిలకించేందుకు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

వేములపల్లి ఏపీఎంగా జానకి బాధ్యతల స్వీకరణ

వేములపల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వేములపల్లి మండల ఏపీఎంగా ఎరుకల జానకి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఆర్‌డీఏలో ఏపీఎంగా పనిచేసిన జానకి బదిలీపై ఇక్కడికి రాగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న నిజామొద్దిన్ మిర్యాలగూడకు బదిలీపై వెళ్లారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు కొంచెం నాగమణి, సీసీలు గోపినాథ్, రమణయ్య, సురేందర్‌రెడ్డి, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

సాగర్‌లో పోస్టల్ సేవలకు అంతరాయం

నాగార్జునసాగర్,ఆగస్టు4(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో సోమవారం పోస్టల్ సేవలకు అంతరాయం ఏర్పడింది. సాగర్ నుంచి ఇతర ప్రాంతాలకు పంపించే స్పీడ్ పోస్టు, రిజిస్టర్ పోస్టుల కోసం వచ్చిన వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. అంతరాయంపై అధికారులను వివరణ కోరగా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నారని తెలిపారు. దీంతో కొన్ని పోస్టల్ సేవలకు సోమవారం అంతరాయం కలిగినట్లు చెప్పారు.



కమ్మేసిన కంపచెట్లు



ఏకేబీఆర్ రిజర్వాయర్ డీ-8, డీ-9 కాల్వకు రోడ్డుకు ఇరువైపులా కమ్మేసిన కంపచెట్లు

పెద్ద అడిశర్లపల్లి మండలంలోని ఏకేబీఆర్ రిజర్వాయర్ అనుబంధ కాలువలు డీ-8, డీ-9 తిరుమలగిరి గ్రామానికి వెళ్లే రోడ్డును ఇరువైపులా కంపచెట్లు కమ్మేశాయి. తిరుమలగిరి, దుగ్యాల గ్రామాలకు ఈ కాలువ రోడ్డుపై అంగడిపేట ఎక్స్ రోడ్డు నుంచి ఆటోలు, బైక్‌లు వెళ్తుంటాయి. దీంతో ఈ దారి గుండా పోయే వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు ఇరువైపులా ఉన్న కంపచెట్లు తొలగించాలని కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి- పెద్దఅడిశర్లపల్లి)

గ్రంథాలయానికి ఆలనా, పాలనా కరువు

● డిండి గ్రంథాలయంలో కనీస వసతులు కరువు ● ఇబ్బందులు పడుతున్న పాఠకులు

(ఆంధ్రజ్యోతి-డిండి)

ఎందరికో జ్ఞానాన్ని పంచిన డిండి మండల కేంద్రంలోని గ్రంథాలయానికి ఆల నా పాలనా కరువైంది. 1987 సంవ త్సరంలో అద్దె భవనంలో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అనంతరం 1994-95 సంవత్సరంలో రోజ్‌గార్ నిధుతో గ్రంథాలయానికి ఒక గదిని నిర్మించారు. కానీ అప్పుడూ చుట్టూ ప్రహరీ నిర్మించకపోవడంతో గ్రంథాలయ పరిసరాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మా రింది. పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. గ్రంథాలయంలో తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీససౌకర్యాలు లేక పాఠకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ గ్రంథాలయ అధికారిగా పని చేస్తున్న ఉద్యోగి 2011లో ఉద్యోగ విరమణ చేశారు. ఆ తరువాత మరో ఉద్యోగి నియామకం జరగలేదు. పాఠకులు కుర్చోనేందుకు కుర్చీలు, బల్లలు వంటి కనీస సౌకర్యాలు లేవు. దీ పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలతో పాటు విజ్ఞానాన్ని పంచే గ్రంథాలు సరఫరా లేకపోవడంతో క్రమంగా విజ్ఞాన భాండాగారాలు ఆదరణ కోల్పోతున్నాయి. గ్రంథాలయ ప్రాంగణం పార్కింగ్ స్థలంగా మారింది.



ప్రహరీ లేని డిండి శాఖ గ్రంథాలయం



మౌలిక వసతులు కల్పించాలి

డిండి మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదనపు గదుల నిర్మాణంతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులకు కావలసిన పుస్తకాలను అందుబాటులో ఉంచాలి.

-ఎదుర్ల విజయ్‌కుమార్, పాఠకుడు

ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలి



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అన్నారు. మండలంలోని కాల్వపల్లి గ్రామంలో సోమవారం ముత్యాలమ్మ తల్లి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసి మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జెట్టి లింగయ్య, తలకొప్పుల సైదులు, భిక్షానాయక్, రామరాజు, చెన్నబోయిన వీరయ్య, పైడిమర్రి నరసింహారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : డీఎస్పీ



క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలతో రాణించాలని డీఎస్పీ రాజశేఖరరాజు అన్నారు. సబ్ జూనియర్ జూడో పోటీల్లో ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను సోమవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ శ్రీధర్ మాట్లాడుతూ సబ్ జూనియర్ జూడో పోటీల్లో పట్టణ క్రీడాకారులు ఉదయ్, అమన్, మణిసాత్విక్ బంగారు పతకాలు సాధించడంతో పాటు వరంగల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

నిడమనూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో ఇళ్ల నిర్మాణాలకు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం సోమవారం శంకుస్థాపన చేశారు. అంతకు ముందు ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. సమావేశంలో నందికొండ మట్టారెడ్డి, కొండా శ్రీనివాస్‌రెడ్డి, శివమారయ్య, నర్సింగు విజయ్, ముల్క శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, పుట్ట మధు, పగడాల మధు పాల్గొన్నారు.

వైద్యులు సకాలంలో విధులకు హాజరుకావాలి



గుర్రంపోడు : చేపూరులో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లయ్య

నాగార్జునసాగర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. స్థానిక హిల్‌కాలనీలో స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రిని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయ న ఆసుపత్రిలో రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. వార్డుల్లో తిరిగి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాత ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఆసుపత్రి భవనాన్ని మరమ్మతులు చేస్తే నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయవచ్చునని ఆసుపత్రి సిబ్బంది ఎమ్మెల్యేకు తెలపగా అందుకు తాను వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో మాట్లాడుతానన్నారు. ఆయన వెంట జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, ఆర్‌ఎంవో డాక్టర్ భాను ప్రసాద్ నాయక్, భగవాన్ నాయక్, రఘువీర్, శంకర్, నాగరాజు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

గుర్రంపోడు : మహనీయుల ఆశయాల స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. సోమవారం చేపూరులో ఏర్పాటు చేసిన అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలను మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల జీవితం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పోలె రామచంద్రం, మారపాక నరేందర్, కొమ్ము సుదర్శన్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు , పింఛన్లు ఇవ్వాలి

మాడ్గులపల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన ఒంటరి, వితంతు మహిళలకు ప్రభుత్వం పింఛన్లతో పాటు ఇందిరమ్మ ఇళ్లు అందించాలని సీపీఐ నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పబ్బుం వీరస్వామి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ఆ ందోళన నిర్వహించి అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ పథకాల్లో వితంతు, ఒంటరి మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు కార్యక్రమంలో యాదగిరి అబ్రహం, దుర్గమ్మ, స్వప్న, మంజుల, మారతమ్మ, నాగమ్మ, నాగమణి పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

పేదల ఇళ్లకు పెద్దోళ్లు సాయం చేయాలి

మిర్యాలగూడ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : పేదోలు నిర్మించుకునే ఇందిరమ్మ ఇళ్లకు పెద్దలు సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌తో కలిసి సిమెంట్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆదానీ, అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రొడక్ట్ కాస్ట్, ట్రాన్స్‌పోర్టు చార్జీల మేరకే సిమెంట్ సరఫరా చేయాలని రిక్విజేషన్ లెటర్స్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తోందని అన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కావల్సిన ఇసుక కొరతను నివారణకు పట్టణంలో ఇందిర మ్మ కాలనీ జంక్షన్‌లో సాండ్ బజార్‌ను ఏర్పాటు చేసి టన్ను రూ.1,250కే విక్రయిస్తున్నట్లు చెప్పారు ప్రస్తు తం సిమెంట్ బస్తా ధర రూ. 350కి విక్రయిస్తుండగా లాభాపేక్ష లేకుండా తక్కువ ధరకు సిమెంటును సరఫరా చేయాలని కోరినట్లు తెలిపారు. ఒక్కో ఇంటికి 225 బస్తాలు అవసరమవుతాయని ఇంజనీర్లు అంచనా వేసినందున 5000 ఇళ్లకు సరిపడా బస్తాలను సరఫరా చేసేలా యాజమాన్యాలతో మాట్లాడి రెండు రోజుల్లో సానుకూల నిర్ణయం తీసుకునేలా చూడాలని సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతినిధులను కోరినట్లు తెలిపారు. సీఎస్ఆర్ ఫండ్ లో ఉమ్మడి దామరచర్ల మండలంలోని అన్ని హైస్కూల్స్‌లో విద్యాబోధనకు అవసరమైన ఫర్నిచర్, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వైటీపీఎస్ పరిధిలోని గ్రామాల పిల్లలకు ప్రత్యేక పాఠశాలతో పాటు అన్ని వసతులు కలిగిన వైద్యశాలను ఏర్పాటు చేయాలని కోరారు. జూలై 7న పట్టణంలోని సాండ్‌బజార్‌ను ప్రారంభానికి తెలంగాణ మై నింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ భావిష్ మిశ్రా హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆదానీ సిమెంట్ యూనిట్ మేనేజర్ కె.సుబ్బులక్ష్మణ్, అల్ట్రాటెక్ యూనిట్ మేనేజర్ వి.శ్రీనుబాబు, మహేశ్‌కుమార్, విద్యుత్ డీఈ మలిగిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



సిమెంట్ కంపెనీ ప్రతినిధులకు రిక్విజేషన్ లెటర్ అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, సబ్ కలెక్టర్ అమిత్

స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

చందంపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ దేవరకొండ అసెంబ్లీ కన్వీనర్ ఏటి కృష్ణ అన్నారు. బీజేపీ మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పోలేపల్లిలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వినోదచారి, ఆంజనేయులు, వెంకట్, శీను పాల్గొన్నారు.

● చింతపల్లి :ప్రధాని నరేంద్రమోదీతోనే దేశం ప్రగతి సాధిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సమ్మిడి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలో సోమవారం 40వ బూత్ అధ్యక్షుడు గజ్జి అభినవ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, తుటూపల్లి రవికుమార్, దావి శ్రీనివాస్, కుక్కుడపు రామకృష్ణ, బొడ్డు శ్రీనివాస్ పాల్గొన్నారు.



చింతపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

బీసీ రిజర్వేషన్ల సాధనకు ఏకం కావాలి

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు సాధించేందుకు బీసీలందరూ ఏకం కావాలని బీసీ యువజన సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ పిలుపునిచ్చారు. బీసీ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించుకోవాలన్నారు. చట్టసభల్లో బీసీలు స్థానం పొందితే వెనుకబడిన తరగతులకు మేలు జరుగుతుందన్నారు. పార్టీల పేరుతో బీసీలు విడిపోతే అందరికీ నష్టం వాటిల్లే ప్రమాదముందన్నారు. సమావేశంలో సంఘ నాయకులు రమేష్, గంగాధర్, కోటేష్, వీరస్వామి, రవి, ఉపేందర్. శంకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల ఆరోపణలు అవాస్తవం'

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తనపై చేసిన ఆరోపణలు అవాస్తవాలని మండల కేంద్రంలోని కేజీబీవీ ప్రత్యేక అధికారి కవిత సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సైకిల్‌యాత్రలో భాగంగా కేజీబీవీ పాఠశాల వద్దకు రాగా ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థినులు ఉన్న పాఠశాలలోకి రానివ్వలేదనే నెపంతోపాటు పలు కారణాలతో తనపై అసత్య ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. విద్యార్థినులను కలవడానికి ప్రతినెల రెండో ఆదివారం తల్లిదండ్రులకు మాత్రమే అనుమతి ఉందని ఆమె తెలిపారు.

కెనరా బ్యాంకును తరలించొద్దు

● నాగార్జునసాగర్ బ్రాంచ్‌ను హాలియాకు తరలించేందుకు ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్): నాగార్జునసాగర్ హిల్ కాలనీలో గల కెనరా బ్యాంకును హాలియాకు తరలించనున్నారు. ఐదు దశాబ్దాల క్రితం ఈ బ్యాంకును ఏర్పాటు చేశారు. నాటి నుంచి సాగర్ పరిసర ప్రాంతాల్లో ఉన్న కృష్ణపట్టితండాల్లో రైతులు, స్థానిక ఉద్యోగులు, పెన్షన్ దారులు ఈ బ్యాంకులో ఖాతాలను కలిగి ఉన్నారు. దీంతో ఖాతాదారులు బ్యాంకు హాలియాకు తరలించొ ద్దన్నారు. బ్యాంకులో మొత్తం 15 వేల ఖాతాలు, 2,500 బంగారు రుణాల ఖాతాలు ఉన్నాయి. అయితే సెప్టెంబర్ 1వ తేదీ వరకు బ్యాంకు తరలించనున్నట్లు, ఇందుకు ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఈ బ్యాంకు ఖాతాదారులు కృష్ణపట్టె తండాల్లో ఉన్న రైతులు, సాగర్‌లో ఉన్న విశ్రాంత ఉద్యోగులు, బంగారు రుణాల తీసుకునే వారు హాలియాకు వెళ్లాలంటే బస్సు సౌకర్యం కూడా లేదని వాపోతున్నారు. బ్యాం కు హాలియాకు తరలించకుండా ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి చొరవ తీసుకుని కలెక్టర్, కెనరా బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఖాతాదారులు కోరుతున్నారు. కాగా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఈఈ 33 క్వార్టర్‌లో నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు హాలియాలో సాగర్ రోడ్డులో సర్వే నంబరు 51కి మార్చనున్నట్లు వినియోగదారులు గమనించాలని బ్యాంకు మేనేజర్ బ్యాంకు వద్ద ఫ్లెక్సీకి ఏర్పాటు చేయించారు.



కెనరా బ్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న అఖిల పక్షం నాయకులు, ఖాతాదారులు

అఖిల పక్షం ఆధ్వర్యంలో నిరసన

సాగర్ కెనరా బ్యాంకును హాలియాకు తరలించవద్దని అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం బ్యాంకు ఎదుట ఖాతాదారులు నిరసన చేపట్టారు. బ్యాంకు కార్యకలాపాలు నిలిపివేయించారు. దీంతో సమాచారం అందుకున్న ఎస్ఐ ముత్తయ్య తన సిబ్బందితో బ్యాంకు వద్దకు వచ్చి నిరసన విరమించాలని సూచించారు. బ్యాంకు రీజనల్ మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సాగర్‌లో బ్యాంకుకు సరియైనా భద్రత లేని కారణంగానే హాలియాకు తరలిస్తున్నామని ఆర్ఎం ఎస్ఐకి తెలిపారు. దీంతో అఖిలపక్షం నాయకులు నిరసనను విరమించబోమని కూర్చున్నారు. బ్యాంకు మేనేజర్ అఖిలపక్షం నాయకులకు రీజనల్ కార్యాలయం అడ్రస్, మేనేజర్ నంబర్‌కు ఇచ్చి అక్కడకు వెళ్లి కలవాలని తెలిపారు. దీంతో మంగళవారం రీజనల్ కార్యాలయానికి వెళ్లి కలుస్తామని అఖిల పక్షం నాయకులు నిరసనను విరమించారు.

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తి చేసుకోవాలి

పెద్దవూర, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో ఉమాదేవి సూచించారు. మండలంలోని బట్టుగూడెం గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిని ఆమె పరిశీలించి మాట్లాడారు. బేస్‌మెంట్ లెవల్‌లో పనులు పూర్తి చేస్తే రూ.లక్ష ఖాతాలో జమ అవుతాయన్నారు. కార్యదర్శి నాగిరెడ్డి పాల్గొన్నారు.

శివాలయం కమిటీ సమావేశం

హాలియా, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): హాలియా పట్టణంలోని పా ర్వతి సమేత జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం సర్వసభ్య సమావేశం సోమవారం ఆలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో కమిటీ ఏర్పాటు అయిన దగ్గర నుంచి నేటి వరకు రూ.4,18,773 ఆదాయం రాగా రూ. 3,24,881 వ్యయం చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బందిలి పెదసైదులు, గౌరవ అధ్యక్షులు పిల్లి తిరుపతయ్య, మాధవరం నరేందర్‌రావు, బైరు యాదగిరి, గంజి సాంబయ్య సైదులు, రమణారెడ్డి,నాగరాజు, పుల్లయ్య పాల్గొన్నారు.

ఆలయ కార్యవర్గం ఎన్నిక

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని సీతారామచంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి ఆలయ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా నాయిని మాధవ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నీలా లక్ష్మయ్య, కోశాధికారిగా మైల బుచ్చిరెడ్డి ఎన్నికయ్యారు. సమావేశంలో కడారి అంజయ్యయాదవ్, దూదిపాల శ్రీధర్‌రెడ్డి, ఆలంపల్లి నరసింహా, కేసాని లింగారెడ్డి, మారం రవీందర్‌రెడ్డి, సముద్రాల జ్ఞానేశ్వర్, ఉట్కూరి వేమన్‌రెడ్డి, పెద్దిశెట్టి సుధాకర్, చందా ధనుంజయ, బొడిగ శంకర్, మల్లేష్ పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామ రక్ష :సీడీపీవో సక్కుబాయి

చింతపల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు శ్రీరామ రక్ష అని ఐసీడీఎస్ సీడీపీవో సక్కుబాయి తెలిపారు. మండలంలోని వేంటేశ్వరనగర్(మాల్), తీదేడు అంగన్వాడీ కేంద్రాల్లో తల్లివారోత్సవాల సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అంజమ్మ, సుగుణ, టీచర్లు పాల్గొన్నారు. అలాగే వీ.టి.నగర్ పీహెచ్‌సీలో మహిళలపై లైంగిక హింస వేధింపుల చట్టంపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సుగుణ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు కార్యలయాల్లో పని చేస్తున్న మహిళల పట్ల ఇతర వ్యక్తులు వేధించినట్లయితే (ఐ.సీ.సీ) అంతరంగిక నివారణ కమిటీకి ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి వంశీ కృష్ణ, మాస రవి పాల్గొన్నారు.

● వేములపల్లి, కొండమల్లేపల్లి, చందంపేట: వేములపల్లి అంగన్వాడీ కేంద్రం-2 కొండమల్లేపల్లి వినాయక నగర్-2 చందంపేటలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్, సూపర్ వైజర్లు, అంగన్ వాడీ టీచర్లు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



చింతపల్లి: తీదేడు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న సీడీపీవో సక్కుబాయి, పాల్గొన్న సిబ్బంది

చినుకుల లెక్క తప్పుతోంది!

(5వ పేజీ తరువాయి)

కురుస్తున్న వర్షపు చినుకుల లెక్కలనే చెబుతున్నారు. కొన్నిసార్లు వానాకాలంలో భారీ వర్షాలు వచ్చినప్పుడు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నా ఈ లెక్కలు జిల్లా కార్యాలయానికి చేరవేయలేని స్థితిలో మండల సిబ్బంది ఉండటం గమనార్హం.

కరువు పరిస్థితులప్పుడు రైతులకు నష్టమే

సీపీవో కార్యాలయం నుంచి జారీ అవుతున్న వర్షపాతం లెక్కల ఆధారంగానే ఆయా జిల్లాలో కరువును ప్రభుత్వం అంచనా వేస్తుంది. మండలం యూనిట్‌గా జారీ చేస్తున్న వర్షపాతం లెక్కలతో ఒక్కోసారి రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. గతంలో ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయినప్పుడు 33శాతానికి పైగా పంట దెబ్బతిన్నప్పుడే ఆయా పంటల వివరాలను, రైతుల పేర్లను నమోదు చేసేవారు. వర్షపాతం విషయంలోనూ అదే పరిస్థితి ఉంది. అధికారులు మండలంలో కురిసిన వర్షాన్ని లెక్కించి లోటు వర్షపాతం లేదని నివేదిక ఇస్తున్నారు. దీంతో చాలా గ్రామాల్లో వర్షాలు లేకున్నా, ఆ వివరాలు మాత్రం ప్రభుత్వానికి చేరడం లేదు. కొన్నేళ్లుగా జిల్లా పరిషత్ సమావేశాలల్లో ప్రజాప్రతినిధులు సైతం ఇదే విషయంపై ఆందోళన వ్యక్తం చేయడంతో పాటు గ్రామాల వారీగా రెయిన్ గేజ్‌లను ఏర్పాటు చేసి వర్షపాతం వివరాలను నమోదు చేయాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు. అయినా ప్రభుత్వం ఆ వైపుగా దృష్టి సారించడం లేదు. పంటల బీమా వర్తింపజేయాలంటే వర్షపాతం లెక్కల ఆధారంగానే అమలవుతుంది. ప్రస్తుతం చాలా మండలాల్లో రెయిన్ గేజ్ పరికరాలు దెబ్బతినడంతో కచ్చితమైన వర్షపాతం లెక్కలు నమోదు కావడం లేదు.

మండలానికి ఒక రేయిన్ గేజ్ మాత్రమే ఉంది

మండలానికి ఒక రేయిన్ గేజ్ మాత్రమే ఉంది. ఆ రేయిన్ గేజ్ ద్వారానే వర్షపాతాన్ని కొలుస్తాం. మండల కేంద్రంలో మాత్రమే ఇది ఏర్పాటు చేశారు. గ్రామాల వారీగా రేయిన్ గేజ్‌లు ఏర్పాటు చేయలేదు. కొత్తగా ఆటోమెటిక్ రేయిన్ గేజ్ పరికరాలు కొన్ని వచ్చాయి. ఆ పరికరాలతో లెక్కింపు చేస్తాం. అదేవిధంగా మండలాల్లో గంటగంటకు కురిసే వర్షాన్ని లెక్కించేందుకు ఆటోమెటిక్ పరికరాలను ఉపయోగిస్తున్నాం.

- సుబ్బారావు, సీపీవో

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : జూనియర్ / వెంకటేశ్వర: హరిహర వీరమల్లు / రాఘువ: మహావతార నరసింహ / విక్ట్రోస్: హరిహర వీరమల్లు / ఫెంటాస్టిక్ ఫస్ట్ స్టేట్, దేవరకొండ : మనోజ్ : మైబేబీ మైత్రి వెంకటేశ్వర: హరిహర వీరమల్లు